ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 40.0
కనిష్ఠం : 27.0



ఘనంగా మంత్రి కొలుసు జన్మదిన వేడుకలు

రాష్ట్ర గృహ నిర్మాణ, పౌరసరఫరాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి జన్మదిన వేడుకలను నూజివీడు నియోజకవర్గంలో పలుచోట్ల శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆగిరిపల్లిలో కూటమి నాయకులు ఏర్పాటు చేసిన పుట్టినరోజు వేడుకల్లో మంత్రి పాల్గొని కేక్ కట్ చేయగా నాయకులు ఆయనను సన్మానించారు.





భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే

జిల్లావ్యాప్తంగా శుక్రవారం క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే జరుపుకున్నారు. ఉపవాసం ఉండి చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పలుచోట్ల విశ్వాసులు శిలువను మోస్తూ ప్రదర్శనలు నిర్వహించారు. ఏసుక్రీస్తు త్యాగాన్ని గుర్తు చేసుకుంటూ ఆయన శిలువపైన పలికిన చివరి ఏడు మాటలను పాస్టర్లు వివరించారు. ఏలూరు కథోలిక పీఠాధిపతి, మోస్ట్ రెవరెండ్ బిషప్ జయరావు పొలిమేర ఆధ్వర్యంలో నగరంలో భక్తులు శిలువను మోస్తూ ప్రదర్శన నిర్వహించారు.

జిల్లా జడ్జిగా శ్రీదేవి బాధ్యతల స్వీకరణ

ఏలూరు క్రైం, ఏలూరు 18 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా ఎస్.శ్రీదేవి శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. రాష్ట్రవ్యాప్తంగా ఇటీవల జిల్లా న్యాయమూర్తుల బదిలీలు జరిగాయి. ఈ బదిలీలలో విజయవాడ కోర్టు (ఎంపీ, ఎమ్మెల్యేలపై ఉన్న క్రిమినల్ కేసులు విచారణ) ప్రత్యేక న్యాయమూర్తిగా విధులు నిర్వర్తిస్తున్న శ్రీదేవిని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా నియమించారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఏలూరు జిల్లా కోర్టులోని తన చాంబర్‌లో ఉద్యోగ బాధ్యతలను స్వీకరించారు. ఇప్పటివరకు పూర్తి అదనపు బాధ్యతల జిల్లా జడ్జిగా ఒకటో అదనపు జిల్లా జడ్జి ఎం.సునీల్ కుమార్ నిర్వర్తిస్తున్నారు. ఆయన నుంచి బాధ్యతలను జడ్జి శ్రీదేవి చేపట్టారు. జడ్జి సునీల్ కుమార్‌ను విజయవాడకు బదిలీ చేశారు.

లెక్క తేలింది

1035 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ

ఏలూరు అర్బన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : మెగా డీఎస్సీ-2025 ఉపాధ్యాయ నియామకాలకు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఆయా యాజమాన్యాలు, సబ్జెక్టుల వారీగా భర్తీ అయ్యే పోస్టుల సంఖ్యను ఖరారు చేశారు. మొత్తం 1035 పోస్టుల భర్తీకి రాగల రెండు, మూడు రోజుల్లో నోటిఫికేషన్ జారీ అయ్యే అవకాశం ఉంది. ప్రభుత్వ/జడ్పీ/మండల పరిషత్ యాజమాన్యాల పాఠశాలల్లో మొత్తం 725 పోస్టులను భర్తీ చేస్తారు. వీటిలో స్కూల్ అసిస్టెంట్ కేడర్‌లో ఫస్ట్ లాంగ్వేజి 35 పోస్టులు, సెకండ్ లాంగ్వేజి 45, ఇంగ్లీషు 77, గణితం 37, ఫిజికల్ సైన్సు 38, బయోలాజికల్ సైన్సు 58, సోషల్ స్టడీస్ 97, ఫిజికల్ ఎడ్యుకేషన్ 178 పోస్టులు, ఎస్జీటీ కేడర్‌లో 160 పోస్టులను నోటిఫై చేయనున్నారు. మున్సిపల్ యాజమాన్య పాఠశాలలకు సంబంధించి నోటిఫై చేయనున్న 310 పోస్టుల్లో ఫస్ట్ లాంగ్వేజి 14, సెకండ్ లాంగ్వేజి 3, ఇంగ్లీషు 8, గణితం 8, ఫిజికల్ సైన్సు 4, బయోలాజికల్ సైన్సు 1, సోషల్ స్టడీస్ 5, ఫిజికల్ ఎడ్యుకేషన్ 7 పోస్టులు, ఎస్జీటీ కేడర్‌లో 260 పోస్టులను భర్తీ చేస్తారు. కాగా దీనిపై అధికారిక ప్రకటన విడుదల కావాల్సి ఉంది. ఇక ప్రత్యేకావసరాలు గల (సీడబ్ల్యూఎస్ఎన్)పిల్లలకు బోధించేందుకు కన్వర్షన్ పద్ధతిపై ఇటీవల జిల్లాకు మంజూరైన 166 స్పెషల్ ఎడ్యుకేషన్ స్కూల్ అసిస్టెంట్ కేడర్ పోస్టుల భర్తీకి ప్రత్యేకంగా నియామకాల షెడ్యూలును మెగా డీఎస్సీతో సంబంధం లేకుండా తర్వాత విడుదల చేస్తారు.

నేడు విధులకు కలెక్టర్

ఏలూరు, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి) : జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి శనివారం విధులకు హాజరు కానున్నారు. ఇటీవల సెలవుపై వెళ్లగా, ఇన్‌చార్జి కలెక్టర్‌గా జేసీ ధాత్రిరెడ్డి వ్యవహరించారు. మూడో శనివారం జరిగే స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో వెట్రిసెల్వి పాల్గొనున్నారు.

చింతలపూడి మునిసిపల్ కమిషనర్ రాంబాబు బాధ్యతల స్వీకరణ



చింతలపూడి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : చింతలపూడి నగర పంచాయతీ మునిసిపల్ కమిషనర్‌గా ఎ.రాంబాబు శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. జగ్గయ్యపేట మునిసిపాలిటీలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తూ పదోన్నతిపై ఇక్కడకు కమిషనర్‌గా బదిలీ అయ్యారు. గతంలో నందిగామ, జగ్గయ్యపేట, విజయవాడలలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేశారు. చింతలపూడి నగర పంచాయతీని ప్రజల సహకారంతో అభివృద్ధి పథంలో నడిపిస్తానని, శానిటరీ, మంచి నీరు వంటి విషయాలపై ప్రధానంగా దృష్టి పెడతానని ఆయన పేర్కొన్నారు. కాగా ఇప్పటి వరకు కమిషనర్‌గా పని చేసిన బి.పావని అనంతపురం బదిలీపై వెళ్లారు.



నీరు అడుగంటిన గోనెపాడు మంచినీటి చెరువు

తాగునీటి గండం!

అడుగంటిన మంచినీటి చెరువులు

- వేసవి ఎండలతో రంగు మారిన నీరు
- పనిచేయని ఫిల్టర్‌బెడ్లు
- మరో 15 నుంచి 20 రోజులకు మాత్రమే సరిపడా నీరు
- ఆందోళనలో ఆయా గ్రామాల ప్రజలు
- అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలంటూ విజ్ఞప్తి

ఆంధ్రజ్యోతి పరిశీలన

వేసవి ఎండలు ఎక్కువ కావడంతో గ్రామాల్లో మంచినీటి చెరువులు అడుగంటిపోయాయి. ఎక్కడ చూసినా చెరువుల్లో 30 శాతం మాత్రమే నీరు ఉంది. ఎండ వేడి ఎక్కువగా ఉంటే మరో 15 నుంచి 20 రోజులు మాత్రమే మంచినీటి సరఫరా అయ్యే పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో ఈ వేసవిలో తాగునీటి ఎద్దడి పొంచి ఉందని, అధికారులు సత్వరం చర్యలు తీసుకుని నీటి ఎద్దడి లేకుండా చూడాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో తాగునీటి సమస్యలపై ఆంధ్రజ్యోతి పరిశీలన..

• రోజు విడిచి రోజు నీరు సరఫరా

కైకలూరు : కైకలూరు మండలం ఆటపాకలో మంచినీటి చెరువు అడుగంటడంతో గత 15 రోజులుగా రోజు విడిచి రోజు మంచినీటిని సరఫరా చేస్తున్నారు. గోనెపాడులో ఇదే పరిస్థితి ఉంది. గ్రామాల్లో జనాభా పెరుగుతున్నప్పటికీ చెరువు విస్తీర్ణం పెరగకపోవడంతో తీవ్ర మంచినీటి ఎద్దడి ఏర్పడుతుంది. కైకలూరు, గోపవరం, వేమవరప్పాడు, తామరకొల్లు, భుజబలపట్నం, పల్లెవాడ, రామవరం, తదితర గ్రామాల్లో నీరు అడుగంటింది. ఎండవేడికి చెరువుల్లోని నీరు ఆకుపచ్చ రంగులోకి మారింది. ఇప్పటికే ఫిల్టర్‌బెడ్లు పని చేయకపోవడంతో చెరువుల్లోని నీటిని కుళాయిల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. కొన్ని గ్రామాల్లో పురుగులు సైతం నీటిలో రావడంతో తాగేందుకే కాదు వాడుకునేందుకు పనికిరాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రభుత్వం స్పందించి కాలువలకు నీరు విడుదల చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

• ఏలూరు వాసులకు పొంచి ఉన్న ప్రమాదం

ఏలూరు టూటౌన్ : ఏలూరు నగర ప్రజలకు రానున్న వేసవిలో తాగునీటి ప్రమాదం పొంచిఉంది. నగర ప్రజలకు తాగునీరు సరఫరా చేసే దెందులూరు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులో గత 20 ఏళ్లలో ఎప్పుడు లేనంతగా నీళ్ల అడుగంటాయి. 117 ఎకరాల్లో ఉన్న ఈ ట్యాంకు నిండితే 16.5మీటర్ల ఎత్తు వరకు నీరు ఉంటుంది. కానీ ఇప్పుడు కేవలం 11 మీటర్ల ఎత్తు వరకే నీరుంది. ఈ నీరు కొన్నిరోజుల వరకే సరిపోతుంది. నగరంలో సుమారు 3 లక్షల మంది ప్రజలకు ప్రతీరోజు రెండు పూటల అధికారులు తాగునీరంది స్తున్నారు. గోదావరి కాల్వ సమ్మర్‌స్టోరేజ్ ట్యాంకుకు చివరలో ఉండడంతో కాల్వ నీరు సరిగా పారకపోవడంతో ఈ దుస్థితి నెలకొంది. మరోవైపు ఈనెల 22వ తేదీ వరకు కాల్వలు మూసివేయకుండా గడువు పెంచిన నేపథ్యంలో ఈ వారం రోజుల్లో సాధ్యమైనంత వరకు సమ్మర్‌స్టోరేజ్ ట్యాంకు నింపడానికి కమిషనర్ భానుప్రతాప్ 400 హెచ్‌పీ మోటార్లు రెండు, 20హెచ్‌పీ మోటార్లు 10, అదనంగా తీసుకొచ్చి యుద్ధప్రతిపాదికన గోదావరి జలాలను తోడుతున్నారు.



నీటిమట్టం తగ్గిన దెందులూరు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు

• గొంతు ఎండుతున్న గిరిజనులు

జీలుగుమిల్లి : తాగునీటి సమస్యను పరిష్కరించాలని గిరిజన గ్రామాల మహిళలు కొన్నేళ్లుగా అధికారులను ప్రజా ప్రతినిధులను వేడుకుంటున్నారు. మండలంలో తాటియాకులగూడెం పంచాయతీలో మద్య బర్రింకలపాడు, ఉదయ్ భాస్కర్ కాలనీ, జీలుగుమిల్లి శివారు చిర్రివారిగూడెంలో తాగునీటి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. చిర్రివారిగూడెంలో రెండేళ్లుగా పంచాయతీ మంచినీటి ట్యాంకు లీకై ఆ ప్రదేశంలో నాచుపట్టి నీరు వృథాగా పోతోంది. విద్యుత్తు ఉన్న సమయంలో పంచాయతీ బోరు నీరు ట్యాంకులోకి పంపి నింపుతున్నా, ట్యాంకు లీకేజీలు కారణంగా నీరు నిల్వ ఉండడం లేదు. దీంతో ఇళ్ల వద్ద కుళాయిల ద్వారా నీరు రావడంలేదు. మద్య బర్రికంలపాడు, ఉదయ్ భాస్కర్‌కాలనీల్లో పంచాయతీ రక్షిత మంచినీటి బోర్ల నుంచి బురద నీరు రావడం, ట్యాంకులు శిథిలావస్థలో ఉండడంతో స్థానికులు చేతి పంపులు, వ్యవసాయ బోర్ల వద్ద మంచినీటిని తెచ్చుకుంటున్నారు.



చిర్రివారిగూడెంలో నాచు పట్టిన మంచినీటి ట్యాంకు

• నీరు రంగు మారి వాసన..

మండవల్లి : మండవల్లి మండలంలోని అయ్యవారి రుద్రవరం మంచినీటి చెరువు అడుగంటుతుండడంతో ప్రజల్లో ఆందోళన నెలకొంది. వేసవి ప్రారంభంలోనే తాగునీటి పథకాలు పడకేశాయి. ఎన్నడులేని విధంగా పోల్‌రాజ్ కాలువ పరిధిలోని గ్రామాల చెరువులు ఎండిపోతున్నాయి. నీరు రంగు మారి, చిక్కగా వాసన వస్తోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాగునీటి కోసం చెరువులను నింపేందుకు కాలువలకు నీరు విడుదల చేస్తారని ఆశగా ఎదురు చూస్తున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాగబాబు మాట్లాడుతూ నీరు విడుదలవ్వగానే మండలంలోని అన్ని చెరువులను నింపుతామన్నారు.



అయ్యవారిరుద్రవరం అడుగంటిన మంచినీటి చెరువు

• చింతలపూడిలోను తిప్పలే..

చింతలపూడి : చింతలపూడి నగర పంచాయతీ మెయిన్ రోడ్డులో రోజు విడిచి రోజు మంచినీటి సరఫరా ఇస్తున్నారు. 2005లో రోడ్డు విస్తరణ చేసిన నాటి నుంచి ఇప్పటివరకు ఇదే తరహా విధానం అమలు జరుగుతుంది. విస్తరణ తర్వాత రెండోవైపు పైపులైను వేయకపోవడంతో గతంలో వేసిన పైపులైన్లు కొన్నిచోట్ల ఒత్తిడికి లీకేజీ అవుతున్నాయి. ఎప్పటికప్పుడు మరమ్మతులు చేస్తున్నా మంచి నీటి సరఫరా మాత్రం పట్టణంలో రోజు విడిచి రోజే జరుగుతోంది. మూడు వేలకు పైగా ప్రైవేటు కుళాయి కనెక్షన్లు ఉన్నాయి. 35 వరకు మోటార్ల ద్వారా ఓవర్‌హెడ్ ట్యాంక్‌లకు పంపింగ్ ద్వారా నీటి సరఫరా జరుగుతోంది. అవసరానికి సరిపడా నీరు ఇవ్వలేకపోతున్నారు. కొన్ని వాడల్లో వేసవిలో ట్యాంకుల ద్వారా సరఫరా చేస్తుంటారు. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. ఈ ఏడాది మండలంలో ఇప్పటివరకు నీటి ఎద్దడి గ్రామాల్లో రాలేదు.

స్లాట్ సక్సెస్

ప్రయోగాత్మకంగా జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో అమలు

- 319 రిజిస్ట్రేషన్లు.. రూ.2.53 కోట్లు ఆదాయం
- 26 నుంచి 11 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లోను అమలు
- ఇప్పటికే జిల్లా అంతటా అవగాహన కార్యక్రమాలు


(ఏలూరు-ఆంధ్రజ్యోతి) : భూములు, ప్లాట్‌ల రిజిస్ట్రేషన్ల కోసం గంటలు, రోజుల తరబడి తిరిగే విధానానికి స్లాట్ బుకింగ్ విధానంతో తెరపడింది. ఏలూరు జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో ఈనెల 4న ప్రయోగాత్మకంగా అమలు చేసిన స్లాట్ బుకింగ్ విధానం సక్సెస్ కావడంతో కేవలం రెండు వారాల వ్యవధిలోనే జిల్లాలోని మిగిలిన 11 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈ విధానాన్ని ఈనెల 26 నుంచి అమలు చేయనున్నారు.

ఏలూరులోని జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో ఈనెల 4వ తేదీన ప్రయోగాత్మకంగా ప్రారంభించిన రోజునే 16 రిజిస్ట్రేషన్లు చేశారు. స్లాట్ బుకింగ్ విధానంలో సమయ పాలన పాటిస్తున్నారు. ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల మధ్య రిజిస్ట్రేషన్లు చేయనున్నారు. అధికారుల గణాంకాల ప్రకారం ఇప్పటి వరకు మొత్తం రెండు వారాల వ్యవధిలో జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో 319 డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్ల ద్వారా రూ. 2 కోట్ల 53 లక్షల 30 వేల ఆదాయం జమ అయ్యింది. ఈ విధానంలో దళారుల వ్యవస్థకు చెక్ పడింది. అన్ని రికార్డులు పారదర్శకంగా ఉంటే గంటలోనే రిజిస్ట్రేషన్లు పూర్తవుతుండటంతో కక్షిదారులకు రూ.వేలల్లోనే అదనపు ఖర్చులు మిగులుతున్నాయి.

రెండు వారాల వ్యవధిలోనే జిల్లా అంతటా అమలు

తాజాగా మిగిలిన 11 కేంద్రాలైన భీమడోలు, చింతలపూడి, జంగారెడ్డిగూడెం, కామవరపుకోట, పోలవరం, గణపవరం, వట్లూరు, కైకలూరు, మండవల్లి, ముదినేపల్లి, నూజివీడు రెండు వారాల వ్యవధిలోనే స్లాట్ బుకింగ్ విధానం అమలు చేయనుండడంతో అక్కడ కక్షిదారుల కష్టాలు తీరినట్టే. కక్షిదారులు ఎప్పుడు కావాలంటే అప్పుడు అన్ని డాక్యుమెంట్లు సిద్ధంగా ఉండి స్లాట్ బుక్ చేసుకుంటే రిజిస్ట్రేషన్లు పూర్తి చేసుకోవచ్చు. ఆస్తుల వివరాలు నమోదు చేసుకున్న తర్వాత ఐడీ వస్తుంది. దాని ఆధారంగా అనుకూలమైన సమయాన్ని నిర్ణయించుకోవచ్చు. అవగాహన లేకపోతే మీ సేవ కేంద్రం, దస్తావేజు లేఖరుల ద్వారా నమోదు చేసుకోవచ్చు. అనుకోని అనివార్య కారణాలతో ఎంచుకున్న సమయంలో కక్షిదారులు రిజిస్ట్రేషన్ కోసం హాజరు కాలేకపోతే ఆందోళన చెందాల్సిన పనిలేదు. పాత ఐడీతోనే ఎప్పుడైనా చేసుకునే వెసులుబాటు కల్పించారు. అవసరమైన పత్రాలన్నీ సిద్ధం చేసుకుంటే ఆ సమయానికి వచ్చి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. ఈ కొత్త విధానంపై జిల్లావ్యాప్తంగా సంబంధిత అధికారులు, సిబ్బంది పెద్ద ఎత్తున కక్షిదారులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.





జోగన్నపాలెం వద్ద గుండేరు వాగులో పెరిగిన తూడు

తూతూ మంత్రంగా..

- వైసీపీ ప్రభుత్వ హయాంలో రూ.కోటి వ్యయంతో గుండేరు వాగు ఆధునికీకరణ
- మొక్కుబడి పనులతో నిండా మునిగిన రైతులు
- టీడీపీ ప్రభుత్వ హయాంలోనైనా పటిష్టంగా పనులు చేపట్టాలని రైతుల విజ్ఞప్తి

దెందులూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ప్రభుత్వం గుండేరు వాగు మరమ్మతు పనులను తూతూ మంత్రంగా చేయడం వల్ల సాగునీరు సాఫీగా కాల్వలో వెళ్లడం లేదని రైతులు వాపోతున్నారు. వాగులో తూడు,పిచ్చి మొక్కలు పెరగడంతో సాగునీరు కాల్వ ద్వారా కిందకు సక్రమంగా వెళ్లే అవకాశం లేకుండా పోయింది. ఇరిగేషన్ అధికారులకు ముందుచూపు లేక పోవడంతో సాగునీరు సక్రమంగా అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతేడాది సెప్టెంబరులో కురిసిన వర్షాలకు జోగన్నపాలెం సమీపంలో గుండేరు వాగులోకి భారీగా వరద నీరు చేరడంతో దెందులూరు -సత్యనాయణపురం వద్ద జాతీయ రహదారి పైకి వరద నీరు పొంగింది. వాహనాల రాకపోకలు నిలిచి పోయాయి. ఈ ఏడాది పంటలకు సక్రమంగా సాగునీరు అందలేదు. లింగపాలెం మండలం కె.గోకవరంలో గుండేరు వాగు ప్రారంభమై కామవరపుకోట కళ్ల చెరువు దగ్గర నుంచి పెదవేగి మండలం మండూరు మీదుగా జోగన్నపాలెం కనక దుర్గమ్మగుడి సమీపంలోని రెగ్యులేటర్ నుంచి గంగన్నగూడెం, దెందులూరు,శ్రీరామవరం పరిధిలోని సత్యనారాయణపురం వరకు చెరువులను నింపుతుంది. మిగులు జలాలు జాతీయ రహదారి కింద నుంచి ఏలూరు గోదావరి కాల్వ దాటి అండర్ కెనాల్ ద్వారా కొల్లేరులో కలుస్తాయి. దీనికి తోడు సాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని పోలవరం కుడి కాల్వను గుండేరు వాగుకు అనుసంధానం చేశారు. అయితే కాల్వ వెడల్పు తగ్గడం, కాల్వ పూడికపోవడం,పిచ్చి మొక్కలతో కాల్వ సాఫీగా సాగక తుపాన్ వచ్చిన ప్రతిసారి గంగన్నగూడెం, దెందులూరు,శ్రీరామవరం, దెందులూరు,సత్యనారాణయపురం గ్రామాల్లోకి, పొలాల్లోకి వరద నీరు చేరు తోంది. 2023 లో వైసీపీ ప్రభుత్వం రూ.కోటి నిధులతో జోగన్నపాలెం రెగ్యులేటర్ దగ్గర నుంచి సత్యనారాణపురం వరకు కాల్వ పనులు చేశారు. అయితే పనులను మొక్కుబడిగా చేయడంతో 2023లో వాగుకు వచ్చిన వరదతో రైతులు భారీగా నష్టపోయారు. ప్రస్తుతం మళ్లీ కాల్వ గట్లు అక్కడక్కడ బలహీనంగా ఉండడంతో పాటుగా పిచ్చి మొక్కలు, తూడు పెరిగి పోయి నీరు సక్రమంగా కిందకు వెళ్లలేని పరిస్థితులు ఉన్నాయి. అధికారులు స్పందించి వరద కష్టాలు మరోసారి ఎదురుకాకుండా వర్షాకాలం రాకముందే ఈ వేసవిలోనే వాగును ఆధునికీకరించాలని మండల ప్రజలు, రైతులు కోరుతున్నారు.



పూడుకుపోయిన గుండేరు వాగు

త్వరలో ట్రాఫిక్ ఎస్ఐ పోస్టు భర్తీ

■ లోపలి పేజీలో..

జంగారెడ్డిగూడెం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఐజీ అశోక్‌కుమార్



ఈకేవైసీతో బినామీలకు చెక్

■ లోపలి పేజీలో..

- సహకార సంఘాల్లో 80 శాతం పైగా పూర్తి
- త్వరలో బినామీలు, డెత్ కేసుల్లో నకిలీల ఏరివేత
- ఈకేవైసీతోనే ఓటుకు అర్హత



ఆంధ్రజ్యోతి తెచ్చిన అదృష్టం

ఆంధ్రజ్యోతి పాఠకులకు బహుమతుల పంట పండింది. ఏటా నిర్వహించే కార్ అండ్ బైక్ రేస్ లక్కీ డ్రా విజేతలకు బైక్, ఫ్రిజ్, టీవీలను ఆంధ్రజ్యోతి కార్యాలయంలో బ్రాంచ్ మేనేజర్ బి.హరిబాబు శుక్రవారం అందజేశారు. బహుమతులు అందుకున్న విజేతలు ఉబ్బితబ్బిబ్బయ్యారు. తమకు లక్కీడ్రాలో బహుమతులు వరించడం అదృష్టమన్నారు.

- కార్ అండ్ బైక్ రేస్ విజేతలకు బహుమతుల పంపిణీ
- ఉబ్బితబ్బిబ్బయిన విజేతలు
- ఆంధ్రజ్యోతికి ప్రత్యేక ధన్యవాదాలు





మొదటి బహుమతి విజేత గోపాలకృష్ణకు చెక్, రెండో బహుమతి విజేత లక్ష్మీఅంజలికి ఫ్రిజ్, మూడో బహుమతి విజేత నాగభూషణంకు టీవీ అందజేస్తున్న బీఎం హరిబాబు, ఏసీఎం కృష్ణ

పెంటపాడు, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి పాఠకుల కోసం నిర్వహించే కార్ అండ్ బైక్ రేస్ లక్కీ డ్రాలో విజేతలకు బ్రాంచ్ మేనేజర్ శుక్రవారం బహుమతులు అందజేశారు. గత నెల 25న అలంపురం ఆంధ్రజ్యోతి కార్యాలయంలో పాఠకుల నడుమ లక్కీడ్రా ఉత్సాహంగా జరిగింది. తాడేపల్లిగూడెం, తణుకు, గోపాలపురం ఎమ్మెల్యేలు బొలిశెట్టి శ్రీనివాస్, ఆరిమిల్లి రాధాకృష్ణ, మద్దిపాటి వెంకట్రాజు తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొని కూపన్ల నుంచి డ్రా తీసి విజేతలను ఎంపిక చేశారు. కొమ్ముగూడెం గ్రామానికి గోపాలకృష్ణ మొదటి బహుమతి బైక్ సొంతం చేసుకున్నారు. అత్తిలి గ్రామానికి చెందిన లక్ష్మీఅంజలి రెండవ బహుమతి ఫ్రిజ్‌ను అందుకున్నారు. మార్టేరుకు చెందిన నాగభూషణం మూడో బహుమతి ఎల్ఈడీ టీవీ సొంతం చేసుకున్నారు. మరో 100 కన్సొలేషన్ బహుమతులు పాఠకులు అందుకున్నారు. విజేతలకు బీఎం బి.హరిబాబు, ఏసీఎం కృష్ణ బహుమతులను అందజేశారు.

మొదటి బహుమతి గెలుచుకోవడం సంతోషం

ఆంధ్రజ్యోతి పత్రిక సుమారు 20 ఏళ్లుగా చదువుతున్నాను. ఆంధ్రజ్యోతి వార్తలు చదవ డానికి చాలా ఆసక్తిగా ఉంటాయి. కార్ అండ్ బైక్ రేస్‌లో మొదటిసారి పాల్గొన్నాను. నా భార్య అపర్ణ ఆసక్తితో కూపన్లు పంపించాను. తొలి ప్రయత్నంలోనే మొదటి ప్రైజ్ బైక్ రావడం చాలా ఆనందం కలిగించింది. ప్రైజ్ తీసుకునేందుకు వెళ్లినప్పుడు ఆంధ్యజ్యోతి యాజమాన్యం కూడా చాలా బాగా రిసీవ్ చేసుకున్నారు. చాలా సంతోషంగా ఉంది. ఆంధ్రజ్యోతికి ప్రత్యేక ధన్యవాదాలు

- అబ్బిన గోపాలకృష్ణ, ఉప సర్పంచ్, కొమ్ముగూడెం

మాటలు రావడం లేదు.. మా అదృష్టం

చాలా సంవత్సరాలుగా ఆంధ్రజ్యోతి పత్రిక చదువుతున్నాం. గత ఐదు సంవత్సరాలుగా కార్ అండ్ బైక్ రేస్‌లో క్రమం తప్పకుండా పాల్గొంటున్నాం. ఇప్పుడు రెండో బహుమతి రావడం చాలా సంతోషంగా ఉంది. మేము బహుమతి సాధిస్తామని అసలు అనుకోలేదు. మాటలు రావడం లేదు ఇది మా అదృష్టం. ఆంధ్రజ్యోతికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలుపుతున్నాం. ఆంధ్రజ్యోతిలో వార్తలు చాలా బాగుంటాయి. అన్ని రంగాలవారికి ఉపయోగపడే విధంగా ఉంటాయి.

- బి.లక్ష్మీఅంజలి, అత్తిలి

కుటుంబంతో ఆనందాన్ని పంచుకున్నాం

నేను గత 18 సంవత్సరాలుగా ఆంధ్రజ్యోతి పేపర్ చదువుతున్నాను. ఆంధ్రజ్యోతిలో వార్తలు చాలా బాగుంటాయి. ఏటా కార్ అండ్ బైక్ రేస్‌లో పాల్గొంటున్నాను. ఈసారి నాకు బహుమతి వచ్చిందని ఫోన్ వచ్చినప్పుడు నాకు కాసేపు మాటలు రాలేదు. చాలా సంతోషపడ్డాను. ప్రైజ్ గెలుచుకున్నం దుకు చాలా ఆనందంగా ఉంది. ఈ ఆనందాన్ని నా కుటుంబసభ్యులు, స్నేహితులతో కూడా పంచుకుంటున్నా. మరోసారి ఆంధ్రజ్యోతికి ధన్యవాదాలు తెలుపుతున్నాను.

- యూ.నాగభూషణం, మార్టేరు

పేదలకు అధికార భాగస్వామ్యం

ఇదే జనసేన అధినేత పవన్ లక్ష్యం : మంత్రి కందుల దుర్గేశ్

తాడేపల్లిగూడెం రూరల్ ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): పేదలకు అధికార భాగస్వామ్యం కల్పించడం ద్వారా అభివృద్ధి సాధించడం జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ లక్ష్యమని మంత్రి కందుల దుర్గేశ్ అన్నారు. ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ నివాసం వద్ద పలువురు వైసీపీ ఎంపీటీలు జనసేన చేరిక సందర్భంగా శుక్రవారం నిర్వహించిన సమావే శంలో ఆయన పాల్గొన్నారు. బయట పార్టీల నుంచి కూటమిలో ఏ పార్టీలో చేర్చుకున్నా అది కూటమి బలోపేతం కోసమేనని స్పష్టం చేశారు. ప్రతీ రైతుకు ధాన్యం విక్రయించిన గంటల వ్యవధిలోనే సొమ్ములు వారి ఖాతాలో జమ కావడం కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధికి అద్దం పడుతుందన్నారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ గత ఐదేళ్ల లో ఎక్కడా రోడ్డువేయలేని స్థితి నుంచి తొమ్మిది నెలల్లో భారీగా రోడ్ల వేసి ప్రజల ఇబ్బందులు సగం తీర్చామన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధి పనులు చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు మాట్లాడుతూ పవన్ కల్యాణ్ విధానాల వల్లే ప్రజలు జనసేనకు ఆకర్షితులవుతున్నారని, కూటమి నాయకులంతా అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తున్నామన్నారు. పెంటపాడు మండల ఎంపీటీసీలు దేవాబత్తుల నాగమణి, తోట నిరీక్షణరావు, దెయ్యం శ్రీనివాసరావు, సీహెచ్ శారద, కె.దేవికారాణి, డి.సత్యనారాయణ, బొచ్చెల తాతారావు, నంద్యాల వెంకన్నబాబుకు ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ సమక్షంలో మంత్రి కందుల దుర్గేశ్, ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు కండువా కప్పి జనసేనలోకి ఆహ్వానించారు.

చిన్న వెంకన్నను దర్శించుకున్న మంత్రి దుర్గేశ్



శ్రీవారు, అమ్మవార్ల చిత్రపటాన్ని అందుకున్న మంత్రి

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమల వేంకటేశ్వరస్వామిని పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేశ్ శుక్రవారం దర్శించారు. ఆయనకు ఆలయ ఈవో ఎన్వీ సత్యనారాయణమూర్తి, అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. మంత్రి ఆలయంలో ప్రదక్షిణల అనంతరం బంగారువాకిలి గుండా స్వామి, అమ్మవార్ల మూల విరాట్‌లను దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో అర్చకులు ఆయనకు స్వామి వారి శేషవస్త్రాన్ని కప్పి వేదాశీర్వచనం పలికారు. అనంతరం ఆలయ ఈవో మూర్తి మంత్రి దుర్గేశ్‌కు స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని, ప్రసాదాలను అందజేశారు.



రంగస్థల నటి మాధవికి మహానటి సావిత్రి పురస్కారం అందిస్తున్న నిర్వాహకులు

అలరించిన హక్కు, దేవరాగం నాటికలు

రంగస్థల నటీమణి మాధవికి సావిత్రి స్మారక పురస్కారం

భీమవరం అర్బన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): భీమవరం కళరంజని నాటక అకాడమి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి తెలుగు నాటిక పోటీలు ప్రేక్షకులను అలరిస్తున్నాయి. శ్రీసోమేశ్వర, జనార్ధన స్వామివార్ల ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న నాటిక పోటీలో మూడో రోజు శుక్రవారం రాత్రి రెండు నాటికలు ప్రదర్శించారు. ముందుగా హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ రంగస్థల నటీమణి ఎస్.మాధవికి మహానటి సావిత్రి స్మారక పురస్కారం, మంజునాథ్‌కు కళారంజని యువతేజం పురస్కారం అందించారు. సమాజంలో కుటుంబాలు, ప్రేమ, ఆదరణ కన్నా అస్థిరంగా ఉండే ఆస్తుల కోసం హక్కుల కోసం కుటుంబాల మధ్య జరుగుతున్న సంఘర్షణల ప్రతిరూపంగా సాగిన సిరిమువ్వ కల్చరల్స్, హైదరాబాద్ వారి హక్కు నాటిక, వృద్ధాప్యంలో తల్లిదండ్రులను కంటికి రెప్పలా కనిపెట్టుకుని ఉంటే తల్లిదండ్రులకు మధురమైన మలిదశ అవుతుందని చాటిన సౌజన్య కళాస్రవంతి ఉత్తరాంధ్ర వారి దేవరాగం నాటికలు అలరించాయి. నటీనటులు హావభావాలతో అందరినీ ఆకర్షించారు. ఈ పోటీలలో నాటక పరిషత్ వ్యవస్థాపక అధ్యక్షుడు జవ్వాది దాశరథి శ్రీనివాస్, గౌరవాధ్యక్షుడు నల్లం వెంకట కృష్ణ నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి మెంటే పూర్ణ చంద్రరావు, మల్లుల సీతారామ ప్రసాద్, గుండా రామకృష్ణ, తదితర ప్రముఖులు, అధిక సంఖ్యలో ప్రేక్షకులు పాల్గొన్నారు.

టీచర్ల సంఖ్య నిర్ధారణకు సమావేశం

ఏలూరు అర్బన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల పునర్వ్యవస్థీకరణలోభాగంగా జూన్ నుంచి ప్రారంభించనున్న ఐదు రకాల బడులకు బోధనా సిబ్బంది ఖరారుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని 48 మండలాల్లో పాఠశాలలకు టీచర్ల కేడర్ స్ట్రెంగ్త్‌ను నిర్ధారించేందుకు శుక్రవారం ఏలూరు సుబ్బమ్మదేవి మునిసిపల్ హైస్కూలులో ఎంఈవోలతో డీఈవో వెంకటలక్ష్మమ్మ సమావేశం నిర్వహించారు. సమావేశానికి పశ్చిమ గోదావరి, ఏలూరు, తూర్పుగోదావరి జిల్లాల నుంచి ఎంఈవోలు హాజరయ్యారు. విద్యార్థుల రోల్‌ను బట్టి ఉపాధ్యాయుల సంఖ్యను నిర్ధారించారు. తుది నివేదికను శనివారం ప్రభుత్వానికి పంపించనున్నారు. దీని ఆధారంగా పాఠశాలలు, సబ్జెక్టులవారీగా టీచర్లు, సర్‌ప్లస్ టీచర్ల పోస్టులను గుర్తించి త్వరలో జరుగనున్న సాధారణ బదిలీలకు వేకెన్సీల జాబితా ఖరారు చేస్తారు.

ఉద్యాన వర్సిటీ ఉద్యోగుల జీతాలు త్వరలో చెల్లిస్తాం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తాడేపల్లిగూడెం రూరల్ ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఉద్యాన విశ్వ విద్యాలయ ఉద్యోగుల జీతాలు త్వరలో చెల్లిస్తామని రిజిస్ట్రార్ బి.శ్రీనివాసులు అన్నారు. 'జీతాలు లేవు' శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. బడ్జెట్ విడుదలలో శాఖాపరమైన సమస్య కారణంగా మార్చి, ఏప్రిల్ జీతాలు మే మొదటి వారంలో వారి ఖాతాలకు జమ చేస్తామని చెప్పారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఫిబ్రవరి జీతం చెల్లించినా సీఎఫ్ఎంఎస్‌లో ఇబ్బంది వల్ల జనవరి జీతం ఇవ్వలేకపోయామన్నారు. మే మొదటి వారంలో ఏప్రిల్‌తో పాటు జనవరి, మార్చి జీతాలు జమ చేస్తామని తెలిపారు. సెక్యూరిటీ గార్డ్ పోస్టులు సీఎఫ్ఎంఎస్‌లో అనుమతి లేని కారణంగా వారి జీతాలు అందించలేకపోయామన్నారు. ప్రభుత్వ అనుమతి వచ్చే వరకు యూనివర్సిటీ ఫండ్ నుంచి అందించే ఏర్పాటు చేస్తామని తెలిపారు. పీజీ, పీహెచ్‌డీ విద్యార్థుల స్టైఫండ్ జనవరి 2025 వరకూ సీఎఫ్ఎంస్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయడానికి అనుమతి లభించలేదని త్వరలో చెల్లించేందుకు చూస్తామని వివరించారు.

ఈకేవైసీతో బినామీలకు చెక్

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా సొసైటీల్లో బినామీ రైతుల ఏరివేతకు ఈకేవైసీ చెక్ పెట్టనుంది. ఉమ్మడి గోదావరి జిల్లా పరిధిలోని పశ్చిమ, తూర్పు, ఏలూరు జిల్లాల్లోని 258 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల్లో (పీఏసీఎస్) వ్యక్తిగత వివరాలతో ఈకేవైసీ కొలిక్కి తెస్తున్నారు.

- సహకార సంఘాల్లో 80 శాతం పైగా పూర్తి
- త్వరలో బినామీలు, డెత్ కేసుల్లో నకిలీల ఏరివేత
- ఇకపై అర్హులకే ఓట్లు



(ఏలూరు-ఆంధ్రజ్యోతి)

ఏలూరు కేంద్ర బ్యాంకు పరిధిలోని 80 శాతం పైగా ఈకేవైసీ పూర్తి కావడంతో రాబోయే ఎన్నికలకు సభ్యత్వం ఉన్న వారే ఓటర్లు కానున్నారు. సొసైటీల్లో రైతుల కింద రూ.300 సభ్యత్వంతో నమోదు చేయించుకుని బినామీలు రుణాలను అడ్డగోలుగా తీసుకునేవారు. వీరి సంఖ్యపై ఒకప్పుడు ఎన్నో ఆరోపణలు ఉండేవి. తాజాగా సొసైటీల కంప్యూటరీకరణతో వారి సంఖ్యపై స్పష్టత వస్తోంది. ఈ నెలాఖరుకు మరణించిన వారు, బినామీలను తొలగించనున్నారు. దీనిపై సహకర శాఖ అధికారుల కసరత్తులు చేస్తున్నారు.

4.39 లక్షలకు 3.64 లక్షలు పూర్తి

- ఉమ్మడి జిల్లాలో 4,39,839 మంది రైతులు సభ్యులుగా ఉన్నారు. ఇందులో 3,64,167 మంది రైతుల ఖాతాలను ఈకేవైసీ చేశారు. 70,432 మందికి ఇంకా పూర్తిచేయాలి.
- ఏలూరు జిల్లాలో 1,68,895 మందికి 1,39,243 మందికి పూర్తిచేశారు. 29,612 మంది ఖాతాల లెక్కలు తేలాలి.
- పశ్చిమలో 1,54,849 మందికి 1,26,956 మందికి పూర్తి చేయగా, ఇంకా 27,893 మంది రైతులకు ఈకేవైసీ చేయాలి.
- తూర్పులో 1,16,895 మందికి గాను 97,968 మందికి పూర్తయ్యాయి. ఇంకా 18,276 మంది రైతులు మిగిలారు.

కమిటీల ఎన్నిక ఎప్పుడు ?

గతంలో రూ.10 వాటాధనం చెల్లిస్తే సరిపోయేది. 2020లో రూ.300 వాటా ధనంగా నిర్దేశించారు. అప్పటికే మెజారిటీ సభ్యులకు రూ.10 వాటా ధనం ఉండగా, వారు మిగిలిన మొత్తాన్ని చెల్లిస్తేనే సభ్యత్వం ఉంటుందని చెప్పడంతో కొందరు చెల్లించారు. కొత్తగా సభ్యత్వం పొందడానికి కొన్ని నిబంధనలు విధించడంతో అనధికారిక సభ్యులు సంఖ్య తగ్గుతూ వచ్చింది. సొసైటీలకు 2013లో చివరిసారిగా ఎన్నికలు జరిగాయి. 2018లో కాల పరిమితి తీరిపోవడంతో ఆరు నెలల చొప్పున ఏడాది వరకు పాత పాలకవర్గాలు కొనసాగుతూ వచ్చాయి. ఈ స్థానంలో వైసీపీ ప్రభుత్వం నామినేటెడ్ కమిటీలను నియమించింది. 2019 ఆగస్టులో త్రిసభ్య డీసీఎంఎస్, డీసీబీబీకి ఏడుగురు సభ్యుల కమిటీలు ఏర్పాటయ్యాయి. ఆరు నెలలకు ఒకమారు కాల పరిమితి పొడిగిస్తూ ఈ కమిటీలను కొనసాగించారు. కమిటీ స్థానంలో తెలుగుదేశం ప్రభుత్వం పర్సన్ ఇన్‌ఛార్జులను నియమించింది. ఈకేవైసీపై జిల్లా సహకార అధికారి ఆరిమిల్లి శ్రీనివాస్‌ను వివరణ కోరగా నెలాఖరు నాటికి ఈకేవైసీ పూర్తి చేయడానికి సిద్ధంగా ఉన్నామని వివరించారు. బినామీ రైతులను తొలగించేందుకు పకడ్బందీగా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

సభ్యులయ్యేందుకు..

- సహకార సంఘాల్లో సభ్యులు కావాలంటే తొలుత రైతుగా గుర్తింపు పొందాలి.
- కనీసం పది సెంట్ల భూమి కలిగి ఉండాలి.
- ఏడాదిపాటు సొసైటీలో ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేయాలి.
- అప్పు తీసుకోవడం లేదా డిపాజిట్ చేయాలి.
- బకాయిదారునిగా ఉండకూడదు.
- ఎన్నికల ప్రకటనకు 30 రోజుల ముందు సభ్యత్వం తీసుకోవాలి.

ప్రజా రక్షణకే పోలీసులు

ఐజీ అశోక్ కుమార్

ఏలూరు క్రైం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : పోలీసులు ప్రజా రక్షణకు కట్టుబడి ఉంటారని ఏలూరు రేంజ్ ఐజీ జీవిజీ అశోక్‌కుమార్ అన్నారు. జిల్లా వ్యాప్తంగా గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకూ అన్ని ప్రధాన రహదారులపై పోలీసులు నాకా బందీ నిర్వహించారు. ఏలూరు పాత బస్టాండ్ వద్ద వాహనాల తనిఖీ తీరును ఐజీ అశోక్‌కుమార్ పరిశీలించారు. ఎస్పీ కేపీఎస్ కిశోర్ స్వయంగా వాహనాల తనిఖీల్లో పాల్గొన్నారు. ఐజీ అశోక్‌కుమార్ మాట్లాడుతూ పోలీసుల ప్రధాన లక్ష్యం కేవలం నేరాలను నివారించడమే కాదని ప్రజలందరికి సురక్షిత వాతావరణాన్ని కల్పించడమేనన్నారు. ఎస్పీ కిశోర్ మాట్లాడుతూ భవిష్యత్‌లో నాకా బందీ కార్యక్రమాలు క్రమం తప్పకుండా నిర్వహిస్తామని కట్టుదిట్టమైన చర్యలు చేపడతామన్నారు. ప్రజల సహకారంతో జిల్లాలో మత్తుపదార్థాల నివారణ, శాంతి భద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తుందన్నారు. ప్రజల భద్రత, నేరాలను నియంత్రించడం, నైతిక పోలీసింగ్‌ను ప్రోత్సహించడం లక్ష్యంఅన్నారు. డీఎస్పీ శ్రావణ్‌కుమార్, పోలీసు అధికారులు పాల్గొన్నారు.



ఏలూరులో వాహనాల తనిఖీ చేస్తున్న పోలీసులు

జంగారెడ్డిగూడెం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ తనిఖీ



జంగారెడ్డిగూడెం పోలీస్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఐజీ అశోక్ కుమార్

జంగారెడ్డిగూడెం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): వార్షిక తనిఖీలలో భాగంగా జంగారెడ్డిగూడెం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను ఐజీ అశోక్‌కుమార్ శుక్రవారం తనిఖీ చేశారు. స్టేషన్‌లో దస్త్రాలను ఆయన పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ జంగారెడ్డిగూడెం పట్టణం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని, క్రైం రేటు కూడా పెరుగుతుందన్నారు. ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో ఎస్సై పోస్టు త్వరలో భర్తీ చేస్తామని, సిబ్బందిని నియమిస్తామన్నారు. చింతలపూడి, జంగారెడ్డిగూడెంలో పోక్సో కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయని, చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం స్టేషన్ ప్రాంగణంలో ఐజీ, ఎస్పీ కె.ప్రతాప్ కిశోర్ మొక్కలు నాటారు. డీఎస్పీ యు.రవిచంద్ర, సీఐ కృష్ణబాబు, ఎస్సైలు జబీర్, శశాంక, కుటుంబరావు పాల్గొన్నారు.

- కామవరపుకోట: పోలీసులు అంకితభావంతో విధులు నిర్వహించాలని ఐజీ అశోక్‌కుమార్ అన్నారు. ఎస్పీ ప్రతాప్ కిశోర్‌తో తడికలపూడి పోలీసుస్టేషన్ సందర్శించారు. రికార్డులు పరిశీలించి కేసుల పరిష్కారంపై పోలీసు సిబ్బందికి సూచనలు ఇచ్చారు. ట్రాఫిక్ నియంత్రణ, రాత్రి నిఘా పెంచాలని, గంజాయి, మత్తు పదార్థాల రవాణా అరికట్టాలన్నారు. స్టేషన్ ప్రాంగణంలో ఐజీ మొక్కలు నాటారు. వారి వెంట జంగారెడ్డిగూడెం డీఎస్పీ రవిచంద్ర. ఎస్ఐ పి. చిన్నారావు, ఏఎస్ఐ వీరాస్వామి, రైటర్ సుధీర్ తదితరులు ఉన్నారు.



మృదుల కుమారికి పురస్కారం, సత్కారం

మూర్తి రాజు ఆశయాలు నెరవేరుద్దాం

సర్వోదయ ఆవిర్భావ దినోత్సవంలో వక్తలు

ఉంగుటూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): దివంగత మూర్తిరాజు ఆశయాలను నెరవేరుద్దామని పలువురు వక్తలు అన్నారు. నాచుగుంట సర్వోదయ నగర్‌లో శుక్రవారం జరిగిన సర్వోదయ మండలి 65వ ఆవిర్భావ కార్యక్రమంలో గాంధేయవాదులు, స్వాతంత్ర్య సమర యోధులు మాట్లాడారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా సర్వోదయ స్ఫూర్తి అవార్డును చర్ల విధుల కుమారికి మరణానంతరం ఆమె సోదరి మృదుల కుమారికి అందించారు. స్త్రీ శక్తి అవార్డును బోయపాటి రామలక్ష్మికి అందించారు. సభలో మూర్తిరాజు జీవిత చరిత్ర అనగనగా ఒక రాజు- మూర్తిరాజు పేరిట ఎస్ఎస్ఏల్.రాజు రచించిన పుస్తకావిష్కరణ జరిగింది. వెంపరాల సూర్యనారాయణమూర్తి, జిల్లా వీర భద్రరావు, సాగిరాజు జానకి రామరాజు, కొండ్రెడ్డి సర్వేశ్వరరావు, జిల్లా సర్వోదయ మండలి ప్రధాన కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు, బొడ్డేపల్లి అప్పారావు, గట్టిం మాణిక్యాలరావు, ఆర్‌వీఎస్.రాజు, సర్పంచ్ బండారు సింధు, అడపా శోభారాణి, ఎంపీపీ గంటా పాల్గొన్నారు.

నరసాపురం నగల దుకాణాల్లో విజిలెన్స్

స్టాక్, తూకం అవకతవకలు గుర్తింపు.. జరిమానా

ఏలూరు క్రైం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): బంగారు షాపుల్లో అక్రమంగా విక్రయాలు జరుగుతున్నాయని, ధ్రువీకరణ లేని ఎలక్ట్రానిక్ కాటాలను వినియోగిస్తున్నారని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా రీజినల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారి వి.శ్రీరాంబాబుకు సమాచారం అందింది. ఆయన ఆదేశాల మేరకు విజిలెన్స్ సీఐ వి.శివరామకృష్ణ, ఎస్ఐ కె.సీతారామ్, తూనికలు, కొలతల అధికారి రాంబాబు, జీఎస్టీ అధికారి ఎ.శ్రీనివాసరావు, సిబ్బంది నరసాపురంలోని రెండు షాపుల్లో శుక్రవారం తనిఖీలు చేపట్టారు. శ్రీజైన్ జ్యూవెల్ పార్కులో తనిఖీలు చేసి 622.37 గ్రాముల బంగారం, నాలుగు కేజీల 907 గ్రాముల వెండి వస్తువులు స్టాక్ రిజిస్టర్ కన్నా తక్కువ ఉన్నట్లు గుర్తించారు. జీఎస్టీ అధికారులు రూ.3,51,004 అపరాధ రుసుము విధించారు. ధ్రువీకరణ లేని ఎలక్ట్రానిక్ కాటాను గుర్తించి తూనికలు కొలతల అధికారులు రూ.25 వేల అపరాధ రుసుము విధించారు. జై అంబికా సంఘవి జ్యూవెలర్స్‌లో తనిఖీ చేసి ధ్రువీకరణ లేని ఎలక్ట్రిక్ కాటాను గుర్తించారు. రూ.25 వేల అపరాధ రుసుము విధించారు. విజిలెన్స్ అధికారులు బంగారు షాపులపై తనిఖీలు చేస్తున్నారని తెలియడంతో కొన్ని షాపుల వారు శుక్రవారం మూసివేశారు.



తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

ద్వారకా నగర్‌లో చోరీ

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు తాళాలు పగులకొట్టి చోరీకి తెగబడ్డారు. బీరువాలోని బంగారు వస్తువులను అపహరించారు. మండలంలోని ఎం నాగులపల్లి పంచాయితీ ద్వారకానగర్‌లో జరిగిన చోరీపై కేసు నమోదైంది. ఎస్ఐ సుధీర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన చేకుర్తి పవన్‌కుమార్ ఈనెల 16న సాయంత్రం ఇంటికి తాళాలు వేసి కుటుంబంతో కలసి దేవులపల్లిలో పంక్షన్‌కు వెళ్లాడు. అదే రోజు రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు బీరువాలో బంగారు చైన్, ఉంగరం, బ్రాస్‌లెట్‌లను తస్కరించినట్లు తిరిగి ఇంటికి వచ్చిన యజమాని ఈనెల 17న గుర్తించి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యార్థినులతో అసభ్యకర ప్రవర్తన

పోక్సో కేసు నమోదు

పెదపాడు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఎస్సీ బాలికల వసతిగృహ వార్డెన్ విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తించాడు. అతడిపై పెదపాడు పోలీసులు శుక్రవారం పోక్సో కేసు నమోదు చేశారు. జడ్పీ హైస్కూల్ ఆవరణలో ఎస్సీ బాలికల వసతిగృహం శిథిలా వస్థకు చేరుకోవడంతో హైస్కూల్ ఆడిటోరియంలో వసతిగృహాన్ని నిర్వహిస్తున్నారు. వార్డెన్ ప్రతిరోజూ ఏలూరు నుంచి హాస్టల్‌కు కారులో వచ్చి వెళుతున్నారు. కారు డ్రైవర్ శీలం ప్రసాద్ ఈనెల 14న ఒక విద్యార్థిని కారులోకి లాగి అసభ్యకరంగా ప్రవర్తించాడని వార్డెన్ దృష్టికి తీసుకెళ్లింది. ఈ సంఘటనపై ఆరా తీయగా మరో ఇద్దరు విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తించినట్లు వార్డెన్‌కు తెలిపారు. దీనితో వార్డెన్ విప్పర్తి విజయలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోక్సో కేసు నమోదు చేసి నట్లు ఎస్సై కట్టా శారద సతీష్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో

యువకుడి మృతి

భీమవరం క్రైం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): వేగంగా వెళుతున్న బైక్ వ్యాన్‌ను ఢీకొనడంతో ఒక యువకుడు మృతి చెందాడు. రూరల్ ఎస్ఐ వీర్రాజు తెలిపిన వివరాల ప్రకారం తూర్పు గోదావరి జిల్లాకు చెందిన అడ్డాల చిన్న (24) హైదరాబాద్‌లో జిమ్ కోచ్‌గా పని చేస్తున్నాడు. గురువారం హైదరాబాద్ నుంచి ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి బయలుదేరాడు. భీమవరం మండలం లోసరి గ్రామం వద్ద హైవేపై వ్యాన్‌ను ఢీకొట్టి కిందపడ్డాడు. తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అతని సోదరుడు దుర్గాప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ..

ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. రూరల్ హెడ్ కానిస్టేబుల్ వెంకటరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 16న దిరుసుమర్రులో బర్రె శ్రీనివాస్ (52) ద్విచక్ర వాహనంపై వెళుతున్నాడు. అదే గ్రామానికి చెందిన నన్నేటి ప్రసాద్ ద్విచక్ర వాహనంపై వస్తూ శ్రీనివాస్ వాహనాన్ని ఢీకొట్టాడు. అతడికి తీవ్ర గాయాలు కావడంతో ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు వెంకటరెడ్డి తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉండిలో గంజాయి స్వాధీనం

11మంది అరెస్ట్

ఉండి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఉండి శివారు ఉప్పుగుంట రోడ్డులో డంపింగ్‌యార్డు వద్ద గంజాయి ముఠా సమాచారంతో ఎస్ఐ నజీరుల్లా ఆధ్వర్యంలో శుక్రవారం పోలీసులు దాడి చేశారు. ముఠాపై దాడి చేసి 1650 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. 11 మందిని అదుపులోనికి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

నేడు.. హనుమజ్జయంతి ఉత్సవాల రాట ముహూర్తం

పెదపాడు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : పెదపాడు మండలం అప్పనవీడులోని అభయాంజనేయస్వామి వారి హనుమజ్జయంతి ఉత్సవాలను మే 17 నుంచి 22 వరకు నిర్వహిస్తామని ఆలయ ఈవో తారకేశ్వరరావు తెలిపారు. దీనికి సంబంధించి 19వ తేదీ శనివారం ఉదయం 8.45 నిమిషాలకు రాట వేస్తామన్నారు. రాట ముహూర్త కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనాలని కోరారు.

నిడమర్రులో టీడీపీ సభ్యత్వ కార్డుల పంపిణీ

నిడమర్రు, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సభ్యత్వ కార్డుల పంపిణీ కార్యక్రమం నిడమర్రులో శుక్రవారం నిర్వహించారు. టీడీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు ఆధ్వర్యంలో పార్టీ మండల అధ్యక్షుడు ముత్యాల స్వామి, సత్తినీడి నాని, పొట్నూరి సింహాచలం, ఆదిరెడ్డి చంద్రరావు తదితరులకు కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అడ్డాడ రఘు, పొట్నూరి సింహాచలం, తమ్మినీడి నక్షత్రం, పైడికొండల శివాజీ, పుప్పాల నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

నాగాశ్విని పేరంటాలమ్మ ఉత్సవాలు ప్రారంభం


ఉత్సవాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్

18 దెందులూరు ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : సంతాన లక్ష్మిగా పేరొందిన పూజారి వారి ఆడపడుచు గాలాయగూడెంలో శ్రీనాగాశ్విని పేరంటాలమ్మ అచ్చమ్మ తల్లి మన నియోజకవర్గంలో ఉండడం అదృష్టంగా భావిస్తున్నామని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. శుక్రవారం మూడు రోజుల పాటు నిర్వహించే ఉత్సవాలను నిర్వాహకులు పూజారి శ్రీనివాసరావు, కనకదుర్గ, పూజారి అన్నవరం దుర్గమ్మ దంపతులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు ఎమ్మెల్యేను భారీ గజమాల వేసి ఘనంగా సన్మానించారు. ఆదివారం ఆలయ ఆవరణలో నిప్పులగుండం నిర్వహిస్తారు.

మంత్రి పార్థసారథికి జన్మదిన శుభాకాంక్షలు

పెదవేగి : రాష్ట్ర గృహనిర్మాణ, సమాచారశాఖ మంత్రి కొలుసు పార్థసారథికి దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం నూజివీడులో ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు చెప్పారు.

మేలో ప్రపంచ తెలుగు సాహితీ సంబరాలు

ఏలూరు రూరల్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): ఏలూరు మహాలక్ష్మీ గోపాల స్వామి కల్యాణ మండపంలో మే10, 11వ తేదీల్లో ప్రపంచ తెలుగు సాహితీ సంబరాలు నిర్వహిస్తున్నట్టు శ్రీశ్రీ కళావేదిక సీఈవో కత్తిమండ ప్రతాప్ తెలిపారు. ఈమేరకు శుక్రవారం సంబంధిత పోస్టర్లను ఆవిష్కరించారు. అంతర్జాతీయ ఛైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ సారథ్యంలో అంతర్జాతీయ సమన్వయకర్తగా కొల్లి రమావతి, జాతీయ ఉపాధ్యక్షులుగా జీఈ ఈశ్వరీ భూషణం, జాతీయ ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ టి.పార్థసారథి ఉన్న శ్రీశ్రీ కళావేదిక ద్వారా ఇప్పటికే పలు ప్రాంతాల్లో 147 శతాధిక కవి సమ్మేళనాలు నిర్వహించి 148వ కార్యక్రమాన్ని ప్రపంచ తెలుగు సాహితీ సంబరాలు పేరుతో ఏలూరులో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సమావేశంలో కొల్లి రమావతి, ఏలూరు జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర కార్యదర్శి శ్రీహరికోట, జిల్లా కార్యదర్శి, రాష్ట్ర కో-కన్వీనర్ ఎంజే సుజయ్‌కృష్ణ, కల్యాణ మండపం అధినేత రామలింగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

'నవయుగ వైతాళికులను విస్మరించడం బాధాకరం'

ఏలూరు రూరల్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): ప్రముఖుల జయంతుల్ని, వర్థంతుల్ని ప్రభుత్వ అధికార కార్యక్రమాలుగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. ఈ జాబితాలో ప్రముఖ తెలుగు నవయుగ వైతాళికులు, సంఘ సంస్కర్తలు, దేశభక్తుల పేర్లను ప్రభుత్వం విస్మరించడం బాధాకరమైన విషయమని రచయితల సంఘం ఖండిస్తున్నట్లు డాక్టర్ లంకా వెంకటేశ్వర్లు, ఎస్.వెంకటేశ్వరరావు అన్నారు. తెలుగులో తొలి వచన కావ్యం కన్యాశుల్కం రచించిన గురజాడ అప్పారావు, తొలి ఆధునికుడు కందుకూరి వీరేశలింగం, మహాకవి శ్రీశ్రీ, నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా, అయ్యంకి వెంకటర రమణయ్య, గిడుగు వెంకట రామ్మూర్తి పంతులు, డాక్టర్ యల్లాప్రగడ సుబ్బారావు, పింగళి వెంకయ్య, గాన గంధర్వుడు ఘంటశాల వెంకటేశ్వరరావు, తదితరుల పేర్లను ప్రభుత్వ అధికారిక జాబితాలో చేర్చాలన్నారు.

ఎన్టీఆర్ వైద్య సేవతో 'ఓపెన్ హార్ట్ సర్జరీ' సక్సెస్


ఓపెన్ హార్ట్ సర్జరీ చేయించుకున్న రోగితో డాక్టర్ రితేష్

ఏలూరు రూరల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) :ఇటీవల ఓ వ్యక్తికి ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా ఓపెన్ హార్ట్ సర్జరీ విజయవంతంగా చేశామని ఆర్‌ఆర్‌పేటలోని డాక్టర్ రితీష్ హాస్పిటల్ గుండె వైద్య నిపుణులు డాక్టర్ రితేష్ తెలిపారు. శుక్రవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఏలూరు ఆశ్రం హాస్పిటల్‌లోనే కాకుండా జిల్లాలో మొట్ట మొదటిసారిగా ఓపెన్ హార్ట్ సర్జరీ చేసిన మొదటి ప్రైవేట్ ఆసుపత్రి తమదేనన్నారు. ఎన్టీయార్ వైద్య సేవ ద్వారా పైసా ఖర్చు లేకుండా వైద్యం అందిస్తామన్నారు. అనతి కాలంలోనే 3000కుపైగా యాంజియోగ్రామ్ పరీక్షలు, 2000లకు పైగా స్టంట్‌లను 98 శాతం విజయవంతంగా నిర్వహించామన్నారు.

బదిలీ కమిషనర్ పావనికి ఘన సన్మానం

చింతలపూడి, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): చింతలపూడి మునిసిపల్ కమిషనర్‌గా పనిచేసి బదిలీపై వెళ్తున్న కమిషనర్ డి.పావనిని తంటేపూడి ఫౌండేషన్ తరఫున ఆమెకు శాలువా కప్పి సన్మానించారు. నగర పంచాయతీలో ఆమె పనిచేసిన కాలంలో శానిటేషన్‌పై దృష్టి పెట్టి మంచిగా పనిచేశారని ఫౌండేషన్ నిర్వాహకుడు వరప్రసాద్ పేర్కొన్నారు. జనసేన మండల అధ్యక్షుడు చీదరాల మధుబాబు, బీజేపీ పట్టణ నాయకులు ఎస్.దుర్గాప్రసాద్, కె.ఉదయ్‌భాస్కర్, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

డ్రోన్ల సాయంతో హైరిస్క్ జోన్ల పర్యవేక్షణ : డీఎస్పీ


డ్రోన్‌తో పరిసర ప్రాంతాలను పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రావణ్‌కుమార్, పోలీసు అధికారులు

ఏలూరు క్రైం, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): రహదారి ప్రమాదాలను నివారించడానికి ఆధునిక, సాంకేతికతను వినియోగిస్తూ డ్రోన్ల సాయంతో ప్రధాన మార్గాలు, హైరిస్క్ జోన్లను పర్యవేక్షిస్తున్నట్టు ఏలూరు డీఎస్పీ డి. శ్రావణ్‌కుమార్ అన్నారు. జిల్లా ఎస్పీ కిశోర్ ఆదేశాల మేరకు శుక్రవారం రాత్రి ఏలూరు సమీపంలోని ఆశ్రం ఆసుపత్రి వద్ద డ్రోన్లతో జాతీయ రహదారి, పరిసర ప్రాంతాలను పరిశీలించారు. అసాంఘిక కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకోవడానికి వాటిని గుర్తించడానికి డ్రోన్లతో పరిశీలన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఏమైనా అనుమానాస్పద పరిస్థితులు గమనిస్తే వెంటనే 112కు సమాచారం ఇవ్వాలన్నారు. ఏలూరు వన్‌టౌన్ సీఐ జి.సత్యనారాయణ, ఏలూరు రూరల్ ఎస్ఐ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

'అన్ని వేళలా నీళ్లతో మంటలను ఆర్పలేం'

ఏలూరు క్రైం, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదాలు రకరకాలుగా ఉంటాయని అన్ని వేళలా నీళ్లతో మంటలను ఆర్పడం సాధ్యపడదని జిల్లా అదనపు అగ్నిమాపక శాఖ అధికారి వి.రామకృష్ణ అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఏలూరు నగరంలోని పలు పెట్రోల్ బంక్‌లు, గ్యాస్ సిలిండర్ల గోడౌన్ల వద్ద సిబ్బందికి శుక్రవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. సాధారణంగా అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు నీళ్లను పోసి మంటలను ఆర్పుతారు కానీ పెట్రోల్, డీజిల్, నూనె మంటలకు నీళ్లు పోయడం ద్వారా ఆ మంటలు మరింత వ్యాప్తి చెందుతాయని వాటిని ఫోమ్ ద్వారా మంటలను ఆర్పాల్సి ఉంటుందన్నారు. పెట్రోల్ బంకుల వద్ద సెల్‌ఫోన్లు కాల్స్ లిఫ్టు చేయడం కాని మాట్లాడుతున్న కాల్ కట్ చేయడం చేయకూడదని బంకుకు వచ్చే ప్రజలను గమనిస్తూ ఉండాలన్నారు.

'వీఆర్‌వోలకు ప్రమోషన్లు ఇవ్వాలి'

ఏలూరు రూరల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) :శ్రీకాకుళం జిల్లాలో మాదిరిగా రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఖాళీగా ఉన్న గ్రేడ్-1 స్థానంలో గ్రేడ్-2 వీఆర్‌వోలకు ప్రమోషన్లు కల్పించి గ్రేడ్-1 ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం, రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లాలో సుమారు 93 మందికి గ్రేడ్-1 వీఆర్వోలుగా ప్రమోషన్లు కల్పిస్తూ ఆదేశాలు ఇవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 1200 గ్రేడ్ 1 పోస్టుల ఖాళీలు ఉన్నాయన్నారు. జీవో 166 వచ్చి సుమారు రెండేళ్లవుతున్నా ఇప్పటివరకు ఏ జిల్లాలో కూడా ప్రమోషన్లు కల్పించలేదన్నారు.


ఏలూరు మైఖేల్ చర్చిలో ఫాదర్ ఆరోన్ ప్రార్థన


జంగారెడ్డిగూడెంలో శిలువ మార్గం నిర్వహిస్తున్న ఆర్‌సీఎం చర్చి ఫాదర్ కల్యాణ్ కుమార్


పెదవేగిలో శిలువ మోస్తూ ప్రచారం చేస్తున్న విశ్వాసులు


బుట్టాయగూడెం శిలువ యాత్రలో ఆర్‌సీఎం చర్చి ఫాదర్ శ్రీపురం జోసెఫ్


ధర్మాజీగూడెంలో శిలువ మోస్తున్న మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళి

భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే

» చర్చిలలో క్రైస్తవుల ప్రత్యేక ప్రార్థనలు
» శిలువ మోస్తూ ప్రదర్శనలు

ఏలూరుటూటౌన్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): గుడ్‌ఫ్రైడే పురస్కరించుకుని చాలామంది క్రైస్తవులు శుక్రవారం ఉపవాసం ఉండి చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఏసుక్రీస్తు శిలువలో మరణించడాన్ని పురస్కరించుకుని నగర వీధుల్లో భక్తులు శిలువను మోస్తూ ప్రదర్శనలు చేశారు. శిలువలో ఏసు క్రీస్తు త్యాగాన్ని గుర్తుచేసుకుని ఆయన శిలువపైన పలికిన చివరి ఏడుమాటలను ఆధ్యాత్మికంగా జ్ఞానించారు. ఏలూరు కథోలిక పీఠాధిపతులు, మోస్ట్ రెవరెండ్ బిషప్ జయరావు పొలిమేర ఆధ్వర్యంలో నగరంలో భక్తులు శిలువను మోస్తూ ప్రదర్శన నిర్వహించారు. సెయింట్ థెరిస్సా హైస్కూల్ నుంచి ప్రారంభమైన ర్యాలీ నగరవీధుల మీదుగా ప్రదర్శనలు ఇస్తూ బిషప్‌హౌస్‌కు చేరుకుంది. ఉదయం అమలోధ్భవి కెథడ్రల్ చర్చిలో ప్రత్యేక గుడ్‌ఫ్రైడే ఆరాధనలు నిర్వహించారు. బిషప్ జయరావు పొలిమేర వ్యాఖ్యోపదేశం చేశారు. ఐసీఎం చర్చిలో బిషప్ రెవరెండ్ జాన్ ఎస్‌డీ రాజు ఏసు శిలువలో పలికిన ఏడుమాటల అర్థాన్ని వివరించారు. మన్నా చర్చిలో బిషప్ ఎం.ఎలీషారాజు ఆధ్వర్యంలో సీనియర్ పాస్టర్ ఎం.జ్యోతిరాజు ఆరాధనలు నిర్వహించారు. ఏఎస్ఆర్ స్టేడియం సమీపంలో ఉన్న సెయింట్ మైఖేల్ చర్చిలో ఫాదర్ ఆరోన్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వ హించారు. సీఎస్ఐ, బాప్టిస్ట్, లూథరన్, ఎల్ఈఎఫ్, పెనుయేలు చర్చి, వలివల చర్చి, శాల్వేషన్ ఆర్మీ చర్చి, క్రీస్తు సంఘం చర్చిలలో గుడ్‌ఫ్రైడే ఆరాధనలు నిర్వహించారు.

● దెందులూరు/పెదవేగి/పెదపాడు :దెందులూరు మండలంలో పలు ఆర్‌సీఎం, సీఎస్ఐ, బైబిల్ మిషన్, పెంతెకోస్తు, రక్షణ సైన్యం, సాల్వేషన్ ఆర్మీతో పాటు పలు చర్చిలో పలువుర ఫాదర్లు, పాస్టర్లు దైవజనులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. టీడీపీ దెందులూరు మండల అధ్యక్షుడు మాగంటి నారాయణప్రసాద్, తెలుగు యవత నియోజకవర్గ అధ్యక్షుడు మోతుకూరి నాని బాబు, పార్టీ మండల కార్యదర్శి నాగనబోయిన సత్యనారాయణ, యలమర్తి శ్రీనివాసరావు తదితరులు ప్రార్థనల్లో పాల్గొన్నారు. పెదవేగి మండలంలో న్యాయంపల్లి, విజయరాయి, పెదవేగి, గార్లమడుగు, దుగ్గిరాల, అంకన్నగూడెం తదితర గ్రామాల్లో శిలువను మోస్తూ క్రీస్తు బోధనలు వినిపించారు. న్యాయంపల్లి విచారణ గురువు ఫాదర్ బాలస్వామి మాట్లాడుతూ త్యాగానికి, సేవా నిరతికి చిహ్నం క్రీస్తు శిలువ ధారణ అన్నారు. గుడ్ ఫ్రైడేను పవిత్ర శుక్రవారం, బ్లాక్ డే అని కూడా అంటారన్నారు. పెదపాడు మండలం పెదపాడు, గుడిపాడు, నాయుడుగూడెం, పునుకొల్లు, అప్పనవీడు, వట్లూరు గ్రామాల్లో సిలువ ధారణతో గ్రామోత్సవాలను నిర్వహించి, ప్రార్థనలు చేశారు.

●చింతలపూడి/లింగపాలెం/కామవరపుకోట/జంగారెడ్డిగూడెం: చింతలపూడిలో బోయగూడెం ఆర్‌సీఎం దేవాలయం నుంచి బహిరంగ శిలువ యాత్రను చర్చి ఫాదర్ కామా మాథ్యూ ఆధ్వర్యంలో జరిపారు. మార్గమధ్యలో ముస్లిం యువకులు, జమాతే ఇస్లామ్ హింద్ ఆధ్వర్యంలో శిలువ యాత్రలో పాల్గొన్న క్రైస్తవులకు శీతల పానీయాలు, వెలమపేట వద్ద బోదల రమేష్ కుటుంబానికి చెందిన సభ్యులు మజ్జిగ ప్యాకెట్లు అందజేశారు. పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సి.హెచ్.రాజశేఖర్ పాల్గొన్నారు. లింగపాలెం మండలం ధర్మాజీగూడెం, లింగపాలెం గ్రామాల్లో ఆర్‌సీఎం చర్చి ఫాదర్‌లు గాబ్రియేలు, ఎన్‌జేఎం కుమార్ ఆధ్వర్యంలో శిలువమార్గం ర్యాలీ నిర్వహించారు. ధర్మాజీగూడెం ఆర్‌సీఎం చర్చిలో చింతలపూడి మాజీ ఎమ్మెల్యే ఘంటా ముర శీరామకృష్ణ సిలువను మోశారు. కామవరపుకోట మండలం కామవరపుకోటలో ఆర్‌సీఎం చర్చి ఫాదర్ పీటర్ ప్రసాద్ ఆధ్వర్యంలో, తడికలపూడిలోని లూర్దుమాత పుణ్యక్షేత్ర డైరెక్టర్ ఫాదర్ డాక్టర్ దోమతోటి నతానియేలు, నెల్లి జార్జి, చుట్టుమాల బాలస్వామి, మాజీ సర్పంచ్ మేరుగు సుందరరావు శిలువ యాత్రను నిర్వహించారు. పలు సెంటర్లలో క్రైస్తవ గీతాలను ఆలపిస్తూ శిలువ యాత్ర కొనసాగింది. జంగారెడ్డిగూడెంలో ఆర్‌సీఎం చర్చి విచారణ గురువు ఫాదర్ కె.కళ్యాణ్‌కుమార్ ఆధ్వర్యంలో స్థానిక ఎంపీడీవో కార్యాలయం సమీపంలోని ప్రధాన రహదారి నుంచి ప్రారంభమైన బహిరంగ సిలువ మార్గం పట్టణంలోని ప్రధాన రహదారుల మీదుగా నిర్వహించారు. రెవరెండ్ ఫాదర్ బాలస్వామి గుడ్ ఫ్రైడే సందేశాన్నిచ్చారు. నిర్మలా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బిందు ఫిలిప్, సెయింట్ జాన్స్ పాఠశాల సుపీరియర్ సిస్టర్ అమలారాణి పాల్గొన్నారు.

●పోలవరం/బుట్టాయగూడెం/టి.నరసాపురం/జీలుగుమిల్లి/ కొయ్యలగూడెం : పోలవరం మండలం పోలవరంలో సీయోను, బెరాకా, వలీవల, కథోలిక ప్రార్థన మందిరాల్లో, కృష్ణారావుపేట, యడ్లగూడెం, కమ్మరగూడెం, ప్రగడపల్లి, కొత్తపట్టిసీమ, గూటాల, పట్టిసీమ, ఎల్లండిపేట గ్రామాల చర్చిలలో క్రైస్తవులు ప్రార్థనలు నిర్వహించారు. పాస్టర్ ఆకుమర్తి డేవిడ్ రాజు మాట్లాడుతూ యేసు మార్గాన నడుచుకోవాలని సూచించారు. బుట్టాయగూడెం మండలం సెయింట్ మార్కుట లూథరన్ దేవాలయంలో సంఘకాపరి రెవరెండ్ ఎంఏ ఆమెన్, ఆర్‌సీఎం చర్చి ఫాదర్ శ్రీపురం జోసెఫ్ ఆధ్వర్యంలో ప్రార్థనలు చేశారు. బుట్టాయగూడెం, గౌరంపేట పురవీధుల్లో సిలువ యాత్రను నిర్వహించారు. టి.నరసాపురం మండలంలోని ప్రకాశ్‌నగర్, పుట్రేపు, రుద్రకోటరా జుగూడెం, గండిగూడెం, మర్రిగూడెం, బొర్రంపాలెం, తెడ్లం, అప్పలరాజుగూడెం, తదితర గ్రామాల్లో క్రైస్తవులు, పాస్టర్లు శిలువ మార్గాన్ని నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో పాస్టర్లు, జి.జ్ఞానరాజు, కె.నిరీక్షణరావు, సీహెచ్ హోషయ్య మాట్లాడుతూ ఏసుక్రీస్తు త్యాగం ప్రపంచ శాంతియుత సమాజానికి దోహదపడుతుందన్నారు. జీలుగుమిల్లి మండలం దర్భగూడెం ఆర్‌సీఎం ఫాదర్ అంతయ్య ఆధ్వర్యంలో ప్రార్థనలు చేశారు. జీలుగుమిల్లి గ్రేస్ మందిర్ ఆధ్వర్యంలో గుడ్ ఫ్రైడేను పాస్టర్ ఎజ్రాశాస్త్రి ఆధ్వర్యంలో జరిపారు. కొయ్యలగూడెం మండలం గవరవరం ఆర్‌సీఎం చర్చి ఫాదర్ ఆనంద్‌భాస్కర్ ఆధ్వర్యంలో అంకాలగూడెం నుంచి గవరవరం వరకు సిలువ మార్గాన్ని నిర్వహించారు. కొయ్యలగూడెం, గవరవరం, పొంగుటూరు, బయ్యన్నగూడెం తదితర గ్రామాల్లో వేడుకలు జరిగాయి.

● ఉంగుటూరు : ఉంగుటూరు మండలంలో శుక్రవారం గుడ్ ఫ్రైడే వేడుకలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. క్రైస్తవులు వారి పెద్దల సమాధుల వద్ద ప్రత్యేక పూల అలంకరణలు చేసి ప్రార్థనలు నిర్వహించారు.

● ద్వారకాతిరుమల : ఏసు చూపిన ప్రేమ మార్గంలో ప్రతి ఒక్కరూ పయనించి పరిశుద్ధులు కావాలని పలువురు పాస్టర్‌లు అన్నారు. మండలంలోని దాదాపు అన్ని గ్రామాల్లో గుడ్ ఫ్రైడే వేడుకలు ఘనంగా జరిగాయి. రాళ్లకుంట విచారణ వద్ద దాదాపు 1300 మంది విశ్వాసులు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రెవరెండ్ ఫాదర్ ఈ.జీవరత్నం తదితరులు శిలువను మోస్తూ గ్రామంలో తిరిగారు.

● కుక్కునూరు : కుక్కునూరు మండలంలో గుడ్‌ఫ్రైడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. దేవుని అపారమైన ప్రేమ, కరుణను మానవాళికి ఇచ్చినరోజని పాస్టర్లు తెలిపారు. పలు చోట్ల ప్రదర్శనలు నిర్వహించారు.


ద్వారకాతిరుమల మండలం రాళ్లకుంట విచారణ వద్ద శిలువ మార్గంలో వస్తున్న క్రైస్తవులు

మంత్రి నాదెండ్ల పర్యటన విజయవంతం చేయాలి


ఎమ్మెల్యే బాలరాజు

జీలుగుమిల్లి, ఏప్రిల్, 18(ఆంధ్రజ్యోతి): పోలవరం నియోజకవర్గంలో ఈనెల 22,23 తేదీల్లో మంత్రి నాదెండ్ల మనోహర్ పర్యటనను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. శుక్రవారం బర్రింకలపాడులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ఏడు మండలాల జనసేన పార్టీ అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. పోలవరం నిర్వాసితులతో ముఖాముఖి, ప్రాజెక్టు కోసం భూములు త్యాగం చేసిన వారి స్థితిగతులను మంత్రి పరిశీలిస్తారన్నారు. పర్యటన విజయవంతం చేసేందుకు ఆయా మండలాల జనసేన నాయకులు సిద్ధం కావాలన్నారు.

నగరాభివృద్ధికి రూ.950 కోట్లు కేటాయించండి

ఏలూరుటూటౌన్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): నగరాభివృద్ధికి రూ.950 కోట్లు కేటాయించాలని 16వ ఆర్థిక సంఘం ఛైర్మన్ డాక్టర్ అరవింద్ పనగారియాకు నగర మేయర్ షేక్ నూర్జహాన్ విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపాలిటీల మేయర్‌లు, ఛైర్మన్‌లతో తిరుపతిలో సమావేశం నిర్వహించారు. సమావేశ అనంతరం ఆర్థిక సంఘం ఛైర్మన్‌కు ఆమె వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నగరంలో విలీనమైన ఏడు పంచాయతీలకు తాగునీటి అవసరాల కోసం రూ.24.56 కోట్లు, 48 కిలో మీటర్ల మేరకు కొత్తరోడ్లు, 95 కిలో మీటర్ల రోడ్లకు మరమ్మతుల కోసం రూ.474 కోట్లు అవసరమవుతాయన్నారు. ఈ గ్రామాల్లో 420 కిలోమీటర్ల మేర డ్రెయినేజీలు నిర్మించడానికి రూ.158 కోట్లు, పాతపార్కుల నిర్వహణకు, కొత్త పార్కులు నిర్మించడానికి రూ.10కోట్లు తదితర అవసరాల నిమిత్తం రూ.950 కోట్లు కేటాయించాలని కోరామన్నారు.

మహిళల రక్షణ కోసమే 'శక్తి యాప్'

ఏలూరు క్రైం, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి):మహిళలు తక్షణ సహాయం పొందే విధంగా శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని ఏలూరు మహిళా పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎం.సుబ్బారావు సూచించారు. జిల్లా ఎస్పీ కిశోర్ ఆదేశాల మేరకు ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు ఆధ్వర్యంలో మహిళా పోలీసులు ఏలూరు నగరంలోని ప్రధాన ప్రాంతాలు, బస్టాండ్లు, షాపింగ్ మాల్స్ వంటి రద్దీ ప్రదేశాల్లో మహిళలకు, యువతులకు శక్తియాప్‌పై అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు మాట్లాడుతూ మహిళలకు ఏమైనా అసౌకర్యాలు ఎదురైతే డయల్ 112 లేదా శక్తి యాప్ ద్వారా సమాచారం ఇస్తే పోలీసులు పది నిమిషాల్లోపే చేరుకుంటారన్నారు.


శ్రీచక్ర కుంకుమార్చన నిర్వహిస్తున్న భక్తులు

అంబికాదేవి సన్నిధిలో శ్రీచక్ర కుంకుమార్చన

ఏలూరుకార్పొరేషన్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): విశ్వావసు నామ సంవత్సర చైత్ర బహుళ పంచమి మూలానక్షత్రం సందర్భంగా సత్రంపాడు అంబికాదేవి ఆలయంలో భక్తులు సామూహికంగా రాహుకాల శ్రీచక్ర కుంకుమార్చనను శుక్రవారం నిర్వహించారు. అర్చకులు అమ్మవారికి పంచామృతాభిషేకం జరిపి అనంతరం విశేష అలంకరణ నిర్వహించి భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ మేనేజర్ ఓలేటి మల్లికార్జునరావు, సిబ్బంది భక్తులకు ఏర్పాట్లు చేశారు. ధ్వజస్తంభం వద్ద మహిళలు సామూహికంగా లలితా పారాయణ నిర్వహించారు.

అంకాలగూడెంలో దత్తాత్రేయ విగ్రహ ప్రతిష్ఠ

కొయ్యలగూడెం, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి):అంకాలగూడెంలో దత్తాత్రేయ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం శుక్రవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. రెండు రోజులుగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. వేదపండితులు స్వామివారికి పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు.


నిడమర్రు కాలనీ వద్ద ఎన్టీఆర్ విగ్రహావిష్కరణలో ఎమ్మెల్యే పత్సమట్ల, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని

నిడమర్రులో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ

నిడమర్రు, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): తెలుగు జాతి గర్వించదగ్గ ప్రజానాయకుడు నందమూరి తారక రామారావు అని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. శుక్రవారం నిడమర్రు పందికోడు వంతెన సమీపాన గల కాలనీ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా టీడీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు విగ్రహావిష్కరణ చేశారు. అనంతరం దివంగత ఎన్టీఆర్ సేవలను కొనియాడారు. టీడీపీ మండల అధ్యక్షుడు ముత్యాల స్వామి, సత్తినీడి నాని, అంబళ్ల విజయభాస్కర్, అంబళ్ల వేణు, పొట్నూరి సింహాచలం, అడ్డాడ రఘు పాల్గొన్నారు.


ల్యాప్‌టాప్ అందజేస్తున్న ఎమ్మెల్యే చంటి

విద్యార్థినికి ల్యాప్‌టాప్ అందజేత

ఏలూరుటూటౌన్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థినికి ల్యాప్‌టాప్‌ను ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి అందజేసి తన ఉదారతను చాటుకున్నారు. వట్లూరు రామచంద్ర ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్న డీఎస్.సత్యదుర్గ అనే విద్యార్థినికి ల్యాప్‌టాప్ బహూకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కష్టపడి చదవి ఉన్నత విద్యనభ్యసించి పదిమందికి సాయం చేయాలని సూచించారు. ఏఎంసీ ఛైర్మన్ పార్థసారథి, సీహెచ్‌వీ.సత్యవరప్రసాద్, విద్యార్థిని తండ్రి టి.జగన్మోహన్ తదితరులు పాల్గొన్నారు.


శ్రీవారి నిత్యాన్న దాన ట్రస్టుకు విరాళం అందిస్తున్న కంపెనీ ఎం.డి., ప్రతినిధులు

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.18 లక్షల విరాళం

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): చినవెంకన్న నిత్యాన్నదాన ట్రస్టుకు ఓ కంపెనీ రూ.18 లక్షలను శుక్రవారం విరాళంగా అందించింది. కృష్ణా జిల్లా బొమ్ములూరులోని దీపక్ నెక్స్‌జెన్ ఫీడ్స్ ప్రైవేటు లిమిటెడ్ ఎం.డి. అడుసుమిల్లి వెంకట సుబ్రహ్మణ్యం ఈ విరాళాన్ని చెక్ రూపంలో ఆలయ ఈవో ఎన్వీ సత్యనారాయణమూర్తికి అందించారు. తొలుత దాత, కంపెనీ సభ్యులు ఆలయానికి చేరుకుని స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. ఆలయ ఈవో మాట్లాడుతూ ఈ సంస్థ ఇప్పటివరకు స్వామివారి అన్నదాన ట్రస్టుకు రూ.1.29 కోట్లు చెల్లించినట్లు వివరించారు. ఏఈవో పి.నటరాజారావు పాల్గొన్నారు.

యూకేలో ఎమ్మెల్యే సొంగా రోషన్‌కు ఘన స్వాగతం

చింతలపూడి, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): పెట్టుబడులను తీసుకురావడమే ధ్యేయంగా నియోజకవర్గంలో అభివృద్ధి పనులు నిర్వహించేందుకు కృషి చేస్తున్న ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్‌కు యూకే వెళ్లగా అక్కడి ఎన్ఆర్ఐలు ఘన స్వాగతం పలికారు. యూకేలో ఉగాది కార్యక్రమాల కోసం ఆయనకు ఆహ్వానం రావడంతో వెళ్లారు. లండన్ ఎయిర్ పోర్టులో ఆయనకు స్వాగతం పలకగా స్థానికులు ఎమ్మెల్యేకు అభినందనలు తెలిపారు.

పాఠశాలల పునర్వ్యవస్థీకరణ సరికాదు : ఏపీటీఎఫ్

ఏలూరు అర్బన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల పునర్వ్యవస్థీకరణలో భాగంగా ఏర్పాటవుతున్న ఫౌండేషన్ పాఠశాలలన్నీ సింగిల్ టీచర్ స్కూల్స్‌గా మారిపోయి, క్రమేణా మూతపడే ప్రమాదం ఉందని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు రామారావు, రెడ్డిదొర ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఐదు వేల ఫౌండేషన్ పాఠశాలలను కేవలం ఒకటి, రెండో తరగతికే పరిమితం చేసి ఏర్పాటు చేస్తున్నారని, వీటిని సింగిల్ టీచరుతో నిర్వహించాల్సి రావడం వల్ల విద్యార్థులకు నాణ్యమైన విద్య ఎలా అందుతుందని ప్రశ్నించారు. స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలు వ్యతిరేకిస్తున్నప్పటికీ తీర్మానాలు ఇవ్వాలంటూ జిల్లా అధికారులు ఉపాధ్యాయులను ఒత్తిడిచేయడం తగదన్నారు. బేసిక్ ప్రైమరీ పాఠశాలల్లో సైతం 20మంది కంటే తక్కువసంఖ్యలో విద్యార్థులుంటే వాటిని ఏకోపాధ్యాయ పాఠశాలలుగా నిర్వహించడం సబబుకాదన్నారు. ప్రభుత్వం తొలుత ప్రకటించిన విధంగా ప్రతీ తరగతికి ఒక ఉపాధ్యాయుడు చొప్పున నియమించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం జారీచేసిన జీవో 117 ఉత్తర్వులను పూర్తిగా రద్దుచేసి గతంలో హైస్కూళ్లలో విలీనంచేసిన 3,4,5 తరగతులను ఆయా ప్రాథమిక పాఠశాలలకు తిరిగి వెనక్కితీసుకురావాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ 20దాటితే మూడో టీచరు పోస్టు ఇవ్వాలని కోరారు.

అంబేడ్కర్ ఫ్లెక్సీని రాయితో కొట్టిన ముగ్గురిపై కేసు

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ ఫ్లెక్సీని రాయితో కొట్టి చింపివేసి శాంతి భద్రతలకు విఘాతం కల్గించిన ముగ్గురిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ టి.సుధీర్ తెలిపారు. దొరసానిపాడులో అంబేడ్కర్ జయంతి రోజున ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని మరుసటి రోజు రాత్రి పొడుదోలు అజయ్, బిరుదుగడ్డ కల్యాణ్, పసుపులేటి కల్యాణ్ రాయితో కొట్టి చింపివేశారు. ఈక్రమంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించడంతోపాటు కుల, మతాల మధ్య వర్గ విభేదాలు సృష్టించేందుకు ప్రయత్నించారనే అభియోగంపై అంబేడ్కర్ కమిటీ సభ్యుడు సునీల్‌కుమార్ ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసునమోదు చేసామన్నారు.

అనాథ మహిళ మృతదేహానికి 'ఆటో యూనియన్' అంత్యక్రియలు

పోలవరం, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): ఒక అనాథ మహిళ మృతదేహానికి పోలవరం చైతన్య ఆటో యూనియన్ సభ్యులు శుక్రవారం అంత్యక్రియలు చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. పోలవరం ప్రాజెక్టు ముఖద్వారం వద్ద నాలుగేళ్లుగా ఒక వృద్ధ జంట యాచన చేసుకుంటూ జీవిస్తున్నారు. వారికి ఆటో యూనియన్ సభ్యులు తరచూ అన్నం అల్పాహారాలు, మందులు అందిస్తూ ఆదుకుంటున్నారు. గురువారం రాత్రి వారిలో పక్షవాతంతో ఉన్న వృద్ధురాలు అనారోగ్యంతో మృతి చెందింది. ఆటో యూనియన్ సభ్యులు ఆసరాగా నిలిచి వృద్ధురాలి మృతదేహానికి శాస్త్రోక్తంగా దహన క్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో షేక్ షెహిన్షాబాషా, ఈర్నాల జాన్‌బాబు, బాజీ, మణికంఠ, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

బిల్డర్స్ సంఘం రాష్ట్ర వైస్ చైర్మన్‌గా బండి పవన్



నూజివీడు టౌన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైస్ చైర్మన్‌గా నూజివీడుకు చెందిన బిల్డర్ బండి పవన్ ఎన్నికయ్యారు. విజయవాడలో నిర్వహించిన అసోసియేషన్ ఎన్నికల్లో వైస్ చైర్మన్‌గా ఎన్నికైన బండి పవన్‌ను అసోసియేషన్ సభ్యులు అభినందించారు.

చీరలు పంపిణీ

చాట్రాయి, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): నూజివీడు నియోజకవర్గ తెలుగుయవత నాయకుడు తేనేటి కిరణ్‌బాబు ఆధ్వర్యంలో చనుబండలో శుక్రవారం 100 మంది పేద మహిళలకు చీరలు, మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తెలుగురైతు జిల్లా ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు, కూటమి నాయకులు చీదిరాల మారేశ్వరరావు, నెక్కలపు వెంకటేశ్వరరావు, బొంతు సతీశ్, పాశం నాగబాబు, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆనందలింగేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ



గంగాపార్వతీ సమేత ఆనందలింగేశ్వరస్వామి

కైకలూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): కైకలూరు శ్యాంప్‌డ్రైన్ గట్టుపై సంతాన నాగేంద్ర స్వామి ఆలయంలో గంగాపార్వతి సమేత ఆనందలింగేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ అంగరంగ వైభవంగా నిర్వహించారు. శుక్రవారం ప్రతిష్ఠ అనంతరం ఆలయంలో స్వామివారి కల్యాణాన్ని కన్నులపండువగా నిర్వహించారు. ఈ కల్యాణంలో కోరుకొల్లు గ్రామానికి చెందిన చినిమిల్లి సత్యనారాయణ, వెంకట మహంకాళమ్మ దంపతులు, కుమారులు చినిమిల్లి ఈశ్వర్ నటరాజ్‌కుమార్, గౌతమి, రుత్విక్ కుమార్ ఆధ్వర్యంలో పూజలు చేశారు. ఆలయ అర్చకులు చావలి శంకరశాస్త్రీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు నిర్వహించి భక్తులకు అన్నప్రసాదాన్ని అందజేశారు.

సీబీ కెనాల్‌లో పూడిక తొలగింపు



కలిదిండి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): గుర్వాయిపాలెం వద్ద శుక్రవారం సీబీ కెనాల్‌లో కలిదిండి, కోరుకొల్లు డీసీ చైర్మన్లు ముద్దం భోగేశ్వరరావు, పేటేటి సత్యనారాయణ ఆధ్వర్యంలో స్వచ్ఛందంగా ఎక్స్‌కవేటర్‌తో మట్టి దిబ్బలు, డెక్క, తూడును తొలగించారు. లంక గ్రామాలకు తాగునీటి వంతు విడుదల చేయనుండటంతో సీబీ కెనాల్ నుంచి పెదలంక కాలువకు తాగునీరు సరఫరాకు ఆటంకం కలుగకుండా దట్టంగా పేరుకుపోయిన చెత్తాచెదారం తొలగిస్తున్నారు. తాగునీటి చెరువులు పూర్తిగా నింపే వరకు తాగునీరును చేపల చెరువులకు మళ్లించకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ ఆదేశించినట్టు తెలిపారు. కాల్వ వెంబడి ఉన్న ఆయిలింజన్లు, మోటారు పంపు సెట్‌లను తొలగించాలన్నారు.

పేదింట విషాదం

- ఉపాధి పనులకు వెళ్ళిన మహిళ మృతి
- ఆరుగురు కుటుంబ సభ్యులకు ఆమె ఆధారం
- పక్షవాతంతో భర్త - కోడలికి ఫిట్స్ వ్యాధి
- దిక్కుతోచని స్థితిలో విలపిస్తున్న కుటుంబం



లలితా శివజ్యోతి (50) (ఫైల్)

ముదినేపల్లి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలం పెదపాలపర్రు గ్రామంలోని ఓగిరాల లలితా శివజ్యోతి (50) గురువారం గ్రామంలో ఉపాధి పనులకు వెళ్ళి గుండె పోటుకు గురై అక్కడి కక్కడే మృతి చెందగా ఆమె కుటుంబం దిక్కు తోచని స్థితిలో పడేసింది. శివజ్యోతి ఒక పక్క గ్రామంలో రజకవృత్తి చేస్తూ, మరో పక్క కూలి పనులకు వెళితేగాని కుటుంబం గడవని పరిస్థితుల్లో ఆమె ఆకస్మిక మరణం ఆ కుటుంబంలో తీరని విషాదాన్ని నింపింది. మృతురాలు శివజ్యోతి భర్త బాబూరావు పది సంవత్సరాలు గా పక్షవాతంతో బాధపడుతున్నాడు. పెద్ద కుమారుడు వర ప్రసాద్ విద్యుత్ షాక్‌కు గురై నాలుగేళ్ల క్రితం మరణించాడు. అతని భార్య అరుణ, ఇద్దరు ఆడ పిల్లల పోషణ భారం కూడా శివజ్యోతి పైనే పడింది. కోడలు అరుణ ఫిట్స్ వ్యాధి గ్రస్తురాలు. బయటకు వెళితే ఎక్కడ పడి పోతుందో తెలియదు. దీంతో కూలిపనులకు వెళ్ళలేదు. చిన్న కుమారుడు బాలాజీ కూరగాయల షాపులో పని చేస్తున్నా అతని సంపాదన నామ మాత్రమే. పక్షవాతంతో బాధపడుతున్న భర్త బాబూరావు భార్య ఆకస్మిక మరణంతో కృంగిపోయాడు. ప్రస్తుతం ఆ కుటుంబ పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది. మృతురాలు శివజ్యోతి కుటుంబానికి అమరావతి బ్రాండ్ అంబాసిడర్ అంబుల వైష్ణవి రూ. 5 వేల నగదు అందజేశారు.

మంచినీటి బోరింగ్ పంపు అపహరణ

ముదినేపల్లి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి - కైకలూరు జాతీయ రహదారి పక్కన హైస్కూలు సమీపంలో ఓ దాత ఏర్పాటు చేసిన బోరింగ్ పంపును గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకుపోయారు. తాగునీటి కోసం శుక్రవారం వేకువ జామునే అక్కడికి వచ్చిన వారికి పంపు కనిపించలేదు. ఆ బోరింగ్ పంపును అపహరించటం గత 16 నెలల్లో ఇది రెండవసారి. దుండగులు ఈ పంపు అపహరణకు పాల్పడిన ప్రతీ సారి దాత, మండల పరిషత్తు కో-ఆప్షన్ సభ్యుడు అల్లా భక్షు తిరిగి వెంటనే పంపును ఏర్పాటు చేస్తూనే ఉన్నారు. తాజాగా పంపు అపహరణపై ఆయన ముదినేపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, ఏఎస్ఐ ఎ.శ్రీనివాస్ పరిశీలించి దర్యాప్తు చేస్తున్నారు. వడాలి, దాకరం గ్రామాల వద్ద కూడా నెల రోజుల క్రితం బోరింగ్ పంపులను దుండగులు అపహరించారు.

తెలంగాణ సరిహద్దులో నాకాబందీ



కృష్ణారావుపాలెం చెక్‌పోస్ట్ వద్ద వాహనాల తనిఖీ

చాట్రాయి, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): విజయవాడ-సత్తుపల్లి రహదారిలో కృష్ణారావుపాలెం తెలంగాణ సరిహద్దు చెక్‌పోస్ట్ వద్ద గురువారం రాత్రి పోలీసులు నాకాబందీ నిర్వహించారు. ఎస్సై రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది ఆ రూటులో తిరిగే కార్లు, ద్విచక్రవాహనాలు, ఆర్టీసీ బస్సులను తనిఖీ చేశారు.



ర్యాలీ చేస్తున్న ముస్లిం సంఘాలు

వక్ఫ్ సవరణ చట్టం రద్దు చేయాలంటూ నిరసన ర్యాలీ

నూజివీడు టౌన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ భూముల సవరణ చట్టం రద్దు కోరుతూ శుక్రవారం నూజివీడులో భారీ ర్యాలీ నిర్వహించారు. ముస్లిం సంఘాలు, వామపక్ష నాయకుల ఆధ్వర్యంలో నూజివీడు పెద్ద మసీదు నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు భారీ ప్రదర్శన నిర్వహించి అనంతరం నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు చలసాని వెంకట రామారావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ చర్యలను నిరసించారు. సీపీఐ పట్టణ కార్యదర్శి చార్ల పుల్లారావు, సీపీఎం నాయకులు జి.రాజు, ఎస్ఆర్ హనుమాన్‌లు ముస్లిం సంఘాల పెద్దలు పాల్గొన్నారు.

రాష్ట్రీయ స్టడీటూర్‌కు వాడవల్లి విద్యార్థినులు



హైదరాబాద్ గోల్కొండ కోట వద్ద గైడ్ టీచర్ సాయిలక్ష్మితో విద్యార్థినులు

ముదినేపల్లి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రీయ స్టడీ టూర్‌లో భాగంగా ముదినేపల్లి మండలం వాడవల్లి యూపీ, వడాలి హైస్కూలుకు చెందిన నలుగురు విద్యార్థులు హైదరాబాద్‌లోని పలు చారిత్రక కట్టడాలను సందర్శించారు. గైడ్ టీచర్ వాడవల్లి యూపీ స్కూలు హెచ్‌ఎం ఎం సాయిలక్ష్మి ఆధ్వర్యంలో గత రెండు రోజులుగా హైదరాబాద్‌లోని చార్మినార్, సాలార్జంగ్ మ్యూజియం, బిర్లామందిర్, గోల్కొండకోట తదితర చారిత్రాత్మక ప్రదేశాలను సందర్శించి విద్యార్థులు వాటి ప్రాముఖ్యతను తెలుసుకున్నారు.









కలిదిండిలో ప్రార్థనలు.. ముదినేపల్లి, ముసునూరు, మండవల్లిలో శిలువ ర్యాలీలు

ఘనంగా గుడ్‌ఫ్రైడే

పలు ప్రాంతాల్లో శిలువ ర్యాలీలు.. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు

కలిదిండి/ముదినేపల్లి/కైకలూరు/ముసునూరు/చాట్రాయి/మండవల్లి/నూజివీడు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): గుడ్‌ఫ్రైడే సందర్భంగా కలిదిండి ఆర్‌సీఎం చర్చిలో క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు నిర్వహించారు. భాస్కరావుపేట, గుర్వాయిపాలెం, సానారుద్రవరం, కోరుకొల్లు, చినతాడినాడ గ్రామాల్లో చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముదినేపల్లి ఆర్‌సీఎం చర్చి ఫాదర్ మరియదాసు ఆధ్వర్యంలో ఏసు క్రీస్తు శిలువతో క్రైస్తవులు ర్యాలీ నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన సుమారు 1500 మంది క్రైస్తవులు ఈ ర్యాలీలో పాల్గొని ఆరాధన నిర్వహించారు. అనంతరం ఆర్‌సీఎం చర్చిలో ప్రార్థనలు జరిపారు. స్థానిక బెతెస్తా పెంతెకోస్తు చర్చిలో పాస్టర్ కటికల ప్రభుదాసు ఆధ్వర్యంలో ప్రార్థనలు నిర్వహించారు. పెయ్యేరు, కొరగుంట పాలెం, చిగురుకోట, అల్లూరు, జానకిగూడెం, పెదపాలపర్రు, చేవూరు, సింగరాయపాలెం తదితర గ్రామాల్లో పాస్టర్లు అర్జా యోహాను, ఉచ్చుల విజయ కుమార్, గొర్ల పీటర్ తదితరుల ఆధ్వర్యంలో క్రీస్తు శిలువతో ర్యాలీలు నిర్వహించారు. క్రీస్తు ప్రభువు తన జీవితంలో ప్రేమ, శాంతి, దయ, కరుణ బోధించారని క్రైస్తవులందరూ క్రీస్తును పోలి జీవించాలని ఆర్సీఎం చర్చి ఫాదర్ రెవరెండ్ గంటా ప్రవీణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం కైకలూరు మండలంలోని గ్రామాల్లో గుడ్‌ఫ్రైడే వేడుకలను అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. గ్రామాల్లోని చర్చిలలో ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కైకలూరులో గుడ్‌ఫ్రైడే సందర్భంగా శిలువ యాత్ర నిర్వహించారు. ముసునూరులో ఆర్‌సీఎం చర్చి ఫాదర్ జోసఫ్ తంబి ఆధ్వర్యంలో గ్రామంలో శిలువ ర్యాలీ నిర్వహించారు. రమణక్కపేట, చెక్కపల్లి, చింతలవల్లి, వేల్పుచర్ల, గోపవరం తదితర గ్రామాల్లో శిలువ మార్గాన్ని ఘనంగా నిర్వహించారు. చాట్రాయి మండలంలోని అన్ని గ్రామాల్లో క్రైస్తవులు గుడ్‌ఫ్రైడే పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. చర్చిలలో ప్రార్థనలు అనంతరం శిలువ యాత్రలు జరిగాయి. మండవల్లి ఆర్సీఎం చర్చి ఫాదర్ ఆధ్వర్యంలో గుడ్‌ఫ్రైడే సందర్భంగా ప్రత్యేక వాహనంపై ఏసుక్రీస్తు వేషధారణతో ప్రదర్శన నిర్వహించారు. వందలాది మంది విశ్వాసులతో ఆర్సీఎం చర్చి నుంచి అగ్రహారం వరకు రహదారిపై ర్యాలీ నిర్వహించి క్రీస్తు కీర్తనలు ఆలపించారు. నూజివీడులో గుడ్‌ఫ్రైడే సందర్భంగా క్రైస్తవ విశ్వాసులు శిలువ మార్గం నిర్వహించారు.







మంత్రికి జన్మదిన శుభాకాంక్షలు చెబుతున్న యువనేత ఉదయ్ కిరణ్.. సూరంపాలెంలో నాయకుల కేక్ కటింగ్.. ఎమ్మెల్యే చింతమనేని శుభాకాంక్షలు

ఘనంగా మంత్రి పార్థసారథి జన్మదిన వేడుకలు

నూజివీడు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గృహనిర్మాణ, పౌరసరఫరాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి జన్మదిన వేడుకలను నూజివీడులో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. నూజివీడులోని మంత్రి క్యాంపు కార్యాలయంలో దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే గంటా మురళీ, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ, నియోజకవర్గంలోని పార్టీ కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు మంత్రిని కలిసి పుష్పగుచ్ఛాలు అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా యాదవ సంఘం ఆధ్వర్యంలోనూ, నూజివీడు మండల టీడీపీ ఆధ్వర్యంలోనూ 60 కేజీల భారీ కేక్‌ను కట్‌చేసి జన్మదిన వేడుకలు నిర్వహించగా, మాజీ ఏఎంసీ చైర్మన్ కాపా శ్రీనివాసరావు, నూజివీడు ఫ్లోర్ లీడర్ చెరుకూరు దుర్గాప్రసాద్, నూజివీడు పట్టణ, మండల టీడీపీ అధ్యక్షులు మల్లిశెట్టి జగదీష్, ముసునూరు రాజా, కౌన్సిలర్ దాసరి స్వామియాదవ్, మాజీ కౌన్సిలర్ కందిపల్లి చెన్నారావు, టీడీపీ నాయకులు యనమదల నాని, జగ్గవరపు వెంకటరెడ్డి, పర్వతనేని సాయి, పటాపంచల సాంబశివరావు, ముక్కొల్లుపాడు ఉపసర్పంచ్ కలగర సాయి, అభిమానులు గజమాలతో సారథిని సత్కరించారు.

రోగులకు పండ్లు పంపిణీ

నూజివీడు ఏరియా ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలను పంపిణీ చేశారు. నూజివీడు మాజీ కౌన్సిలర్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యురాలు గొల్లు దుర్గాదేవి, జీవీ రామారావు ఆధ్వర్యంలో పండ్లు, రొట్టెలు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ టీడీపీ మాజీ అధ్యక్షుడు లాయర్ కుమార్, సూపరింటెండెంట్ నరేంద్రసింగ్, టీడీపీ నాయకుడు మండా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

దేవాలయాల్లో ప్రత్యేక పూజలు

నూజివీడు మండల, పట్టణంలో పలు దేవాలయాలు, చర్చిలలో ప్రత్యేక పూజలు, ప్రార్థనలు నిర్వహించారు. నూజివీడు ఎమ్మార్ అప్పారావు కాలనీలో టీవీ రాజశేఖర్ ఆధ్వర్యంలో చర్చి, మసీదుల్లో ప్రత్యేక పూజలను నిర్వహించారు.

చాట్రాయి: మండలంలోని చాట్రాయి, సూరంపాలెం తదితర గ్రామాల్లో శుక్రవారం నూజివీడు ఎమ్మెల్యే, గృహనిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి జన్మదిన వేడుకలను కూటమి శ్రేణులు ఘనంగా నిర్వహించారు. చాట్రాయి టీడీపీ కార్యాలయంలో జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి మందపాటి బసవారెడ్డి ఆధ్వర్యంలో మంత్రి పార్థసారథి చిత్రపటానికి పాలాభిషేకం చేసి, జన్మదిన కేక్ కట్ చేశారు. అనంతరం స్థానిక పీహెచ్‌సీలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. నియోజకవర్గ టీడీపీ దళిత నాయకుడు నక్కా రాము ఆధ్వర్యంలో సూరంపాలెంలో మంత్రి పార్థసారథి జన్మదిన కేక్ కట్ చేసి వేడుకలు జరిపారు. చాట్రాయి సెంటర్‌లో మాజీ ఎంపీటీసీ అంబటి సత్యనారాయణ(చంటి) ఆధ్వర్యంలో కూటమి శ్రేణులు బాణసంచా కాల్చి కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు కమ్ముల కొండలరావు, రాయవరపు పుల్లారావు, కంచర్ల సరావు, శ్రీరాముల సత్యనారాయణ, యన్నమనేని రామకృష్ణ, కొల్లా శ్రీకాంత్, గాజుల ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

ముసునూరు: రాష్ట్ర గృహనిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథికి టీడీపీ యువ నాయకులు శుక్రువారం జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ముసునూరుకు చెందిన నియోజకవర్గ తెలుగుయువత కార్యాదర్శి కొండేటి ఉదయ్‌కిరణ్(బాబి) విజయవాడలో మంత్రి పార్థసారథిని కలిసి పుష్పగుచ్చం అందజేసి, పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. గోపవరంకు చెందిన యువనేత ఉప్పలపాటి గణేష్ గన్నవరం ఎయిర్‌పోర్ట్‌లో మంత్రిని కలిసి ఆయనతో అక్కడే కేక్‌ను కట్ చేయించి, జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

లక్ష్మీ నరసింహస్వామికి మంత్రి పూజలు



పూర్ణకుంభంతో మంత్రికి స్వాగతం పలుకుతున్న అర్చకులు

ఆగిరిపల్లి: సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి ఆగిరిపల్లిలోని లక్ష్మీ నరసింహస్వామిని దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన మంత్రికి ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆగిరిపల్లిలోని పెద్ద కొటాయి సెంటర్‌లో టీడీపీ దిమ్మ వద్ద కూటమి నాయకులు ఏర్పాటుచేసిన పుట్టినరోజు వేడుకలలో మంత్రి పాల్గొన్నారు. కార్యక్రమంలో చిట్నేని శివరామకృష్ణ, మడుపల్లి గోపాల్, చౌటపల్లి విక్టర్ బాబు, చౌటపల్లి లక్ష్మీ, నరదల రాంబాబు, బాయిన శేషగిరిరావు, పొన్నం కిరణ్, ఆరేపల్లి శ్రీనివాసరావు, బెజవాడ శ్రీనివాసరావు, కొవ్వలి బాబురావు, నక్కనబోయిన వేణు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

అన్నదానం

నూజివీడు టౌన్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రి పార్థసారథి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని నూజివీడు రామకృష్ణ మిషన్‌లో శుక్రవారం అన్నదానం నిర్వహించారు. ముక్కొల్లుపాడు ఉపసర్పంచ్ కలగర శివసాయి ఆధ్వర్యంలో రామకృష్ణ మిషన్ శ్రీ శారద నిత్యాన్నసేవా కార్యక్రమంలో భాగంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఇంటర్వ్యూ..

భక్తులకు మరిన్ని సౌకర్యాలు

రుద్రరాజు గంగా శ్రీదేవి, ఏసీ, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానం, సింగరాయపాలెం



- **సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం వద్ద భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలు?**

జవాబు : దేవస్థానం వద్ద భక్తులకు మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు పలు పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నాము. భక్తులకు వేచి ఉండేందుకు తగిన సౌకర్యాలు కూడా కల్పిస్తున్నాం.

- **దేవస్థానం ఆదాయం పెంచేందుకు ఏమైనా చర్యలు తీసుకుంటున్నారా?**

జవాబు : దేవస్థానం వెనుక ఉన్న ఆవరణలో స్టేట్ హైవే పక్కన షాపింగ్ కాంప్లెక్స్‌ను నిర్మించాలన్న ప్రతిపాదన ఉంది. ఇది జరిగితే స్థిరమైన ఆదాయం వస్తుంది.

- **షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించేందుకు దేవస్థానం వద్ద నిధులు ఉన్నాయా?**

జవాబు : షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ విషయం అధికారుల దృష్టికి తీసుకువెళ్ళాం. దాతలు సహకరిస్తే దేవాదాయశాఖ త్వరగా కాంప్లెక్స్‌ను నిర్మించేందుకు అవకాశం ఉంటుంది.

- **దేవస్థానం కార్యాలయంలో సిబ్బంది కొరత ఉంది కదా?**

జవాబు : నిజమే. సిబ్బంది కొరత ఉంది. ఆఫీసులో సిబ్బందిని నియమించే విషయాన్ని దేవాదాయశాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్ళాం. త్వరలో సిబ్బందిని నియమించే అవకాశం ఉంది.

- ముదినేపల్లి, ఆంధ్రజ్యోతి

ప్రాథమిక పాఠశాలల్ని కొనసాగించాలి

ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి రాజేంద్ర ప్రసాద్



ముదినేపల్లి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఆదర్శ పాఠశాలల ఏర్పాటు, ఉపాధ్యాయుల నియామక విధానాలు గ్రామీణ ప్రాంతాల్లోని పేద విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా ఉండాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి బేతాళ రాజేంద్ర ప్రసాద్ కోరారు. ప్రాథమిక పాఠశాల వ్యవస్థను యథావిధిగా కొనసాగించాల్సిన అవసరం ఉందని ఆయన శుక్రవారం ముదినేపల్లిలో విలేకరులతో మాట్లాడుతూ తెలిపారు. విద్యాశాఖ ప్రవేశపెడుతున్న నూతన విధానాలు ప్రాథమిక విద్యను దెబ్బతీసేవిగా ఉన్నాయన్నారు. ప్రతి ప్రాథమిక పాఠశాలలో ఒకటి నుంచి ఐదు తరగతులు ఉండాలని, ప్రతి పాఠశాలలో కనీసం ఇద్దరు ఉపాధ్యాయులు ఉండాలని డిమాండ్ చేస్తూ, పాఠశాలలో విద్యార్థుల సంఖ్య 20 దాటితే మూడవ ఉపాధ్యాయ పోస్టు మంజూరు చేయాలని ఆయన కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా 1557 ఉన్నత పాఠశాలల్లో ఒకటి నుంచి పదవ తరగతి వరకు ఏర్పాటు చేయాలని నిర్ణయించటం సరైనది కాదని విమర్శించారు. నూతన విధానాల వల్ల రాష్ట్రంలో 19 వేల బేసిక్ ప్రైమరీ పాఠశాలలు సింగిల్ టీచర్ స్కూళ్లుగా మారిపోయే ప్రమాదం ఉందని, ఈ పాఠశాలల్లో తరగతికి ఒక టీచర్‌ని నియమించాలని, లేకుంటే ప్రాథమిక విద్య దెబ్బతింటుందని రాజేంద్ర ప్రసాద్ తెలిపారు.

కొట్లాట కేసులో నిందితుల అరెస్టు

ముదినేపల్లి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : ముదినేపల్లి మండలం సింగరాయపాలెం గ్రామంలో గతనెల 2న జరిగిన కొట్లాట కేసులో నిందితులైన ముగ్గురు వ్యక్తులను శుక్రవారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ వీఎస్ వీరభద్రరావు తెలిపారు. ఆ గ్రామంలో పంట బోదెలో గేదెలు దిగిన సందర్భంలో ఏర్పడిన తగాదాలో చేబోయిన పోతురాజు అనే వ్యక్తిని కొట్టి అదే గ్రామానికి చెందిన బూరుబోయిన రాధాకృష్ణ, కుమారస్వామి, ఏడు కొండలును అరెస్టు చేసి కైకలూరు కోర్టులో హాజరు పర్చినట్లు ఎస్ఐ తెలిపారు.

మోటార్ సైకిల్ చోరీ

కలిదిండి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): కలిదిండిలో దొంతుబోయిన పవన్ కుమార్ మార్చి 9న తన ఇంటి ముంగిట బైక్‌ను ఉంచగా దొంగలు అపహరించారు. అప్పటి నుంచి బైక్ కోసం వెతికాడు. బైక్ దొరక్కపోవటంతో శుక్రవారం కలిదిండి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్ఐ వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బ్రాయిలర్ ధరలు	
అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	127, 136, 147
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250
నెక్ కోడి గుడ్డు ధర (100)	
విజయవాడ జోన్ రైతు ధర రూ.475	



అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన



మంటలను అదుపు చేసే విధానాన్ని చూపుతున్న సిబ్బంది

కైకలూరు, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు అప్రమత్తతో వ్యవ హరిస్తే ఆస్తి, ప్రాణనష్టాన్ని నివారించవచ్చని కైకలూరు రూరల్ ఎస్సై వి రాంబాబు, అగ్నిమాపకశాఖ అధికారి క్రాంతికుమార్ అన్నా రు. శుక్రవారం కైకలూరు శ్రీశ్యామలాంబ అమ్మవారి కళామండపం ప్రాంగణంలో, మండ వల్లి మండలంపెరికేగూడెం గ్రామంలోని వెన్నా ర్ సిరామిక్స్ ప్రాంగణంలో అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా డెమో నిర్వహించారు. అగ్నిప్రమాదం జరిగినప్పుడు వాటిని నివారించేందుకు తీసుకోవల్సిన చర్యలను వివరించడంతో పాటు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కరపత్రాలను వారు పంపిణీ చేశారు. పెట్రోలుబంకుల్లో పనిచేస్తున్న సిబ్బందితో ప్రమాదాలు జరిగినప్పుడు ఏవిధంగా మంటలను అదుపుచేయాలో వారి ద్వారా చేపించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది వి శ్రీనువాస్, ఎం భాస్కర్, మురళీ, గణేషు, అంజిబాబు పాల్గొన్నారు.

త్వరలో ట్రాఫిక్ ఎస్ఐ పోస్టు భర్తీ

ఐజీ అశోక్‌కుమార్



జంగారెడ్డిగూడెం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): వార్షిక తనిఖీలలో భాగంగా జంగారెడ్డిగూడెం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను ఐజీ అశోక్ కుమార్ శుక్రవారం తనిఖీ చేశారు. స్టేషన్‌లో దస్త్రాలను ఆయన పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ జంగారెడ్డిగూడెం పట్టణం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని, క్రైం రేటు కూడా పెరుగుతుందన్నారు. ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో ఎస్సై పోస్టు త్వరలో భర్తీ చేస్తామని, సిబ్బందిని నియమిస్తామన్నారు. చింతలపూడి, జంగారెడ్డిగూడెంలో పోక్సో కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయని, చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం స్టేషన్ ప్రాంగణంలో ఐజీ, ఎస్పీ కె.ప్రతాప్ కిశోర్ మొక్కలు నాటారు. డీఎస్పీ యు.రవిచంద్ర, సీఐ కృష్ణబాబు, ఎస్సైలు జబీర్, శశాంక, కుటుంబరావు పాల్గొన్నారు.